# ముంపు నిర్వాసితులకు పరిహారం ఇప్పించండి





# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 28 ఫిబ్రవరి , 2026 | పేజీలు :08


## పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

### జిల్లా ఆస్పత్రికి కేంద్రం నిధులే ఊపిరి పోస్తున్నాయి

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/కరీంనగర్:**పేదలకు మరింత మెరుగైన వైద్యం అందించడమే తన లక్ష్యమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం కరీంనగర్లోని జిల్లా ఆసుపత్రిలో సిఎస్ఆర్ నిధులతో అందించిన వైద్య ఉపకరణాలని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ, ఇక్కడ వైద్య సేవలు మరింత నాణ్యతగా అందించేందుకు ఎన్‌టిపిసి సహకారంతో ఉపకరణాలను అందించినట్లు తెలిపారు. ఇంకొన్ని పరికరాలు కావాలని స్థానిక ఆసుపత్రి వర్గాలు కోరారని త్వరలోనే వాటిని అందించడానికి చొరవ చూపుతానని హామీ ఇచ్చారు. ఏడాదికి సగటున 50 నుంచి 70 కోట్లు కేంద్ర నిధులే ఇక్కడి ఆసుపత్రికి ఎన్‌హెచ్ఎం నిధులు ఇస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వానికి పేదలపై ఉన్న అభిమానానికి, నిబద్ధతకు నిదర్శనమన్నారు. సిఎస్ఆర్ నిధులతో కోట్లాది రూపాయల విలువైన పరికరాలను అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో కరీంనగర్ జిల్లా ఆస్పత్రిని మరింత ఆదర్శమైన హాస్పిటల్ గా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు.

## పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి..




విద్యార్థులతో ముఖా ముఖి నిర్వహించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్ కలెక్టరేట్ :**పదవ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకాంక్షించారు.శుక్రవారం లక్ష్మ ణచందా మండలంలోని వడ్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలను స్వయంగా పరిశీలించారు.కలెక్టర్ నేరుగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు.గణితం,ఇంగ్లీషు తదితర ముఖ్య విషయాలకు సంబంధించి పలు ప్రశ్నలు అడిగి,వారి సమాధానాలను పరిశీలించారు.విద్యార్థుల అభ్యసన సామర్థ్యంపై సంతృప్తి వ్యక్తం చేశారు.పరీక్షల సమయంలో ఒత్తిడికి లోను కాకుండా,ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శ్రేణి మార్కులు సాధించాలని సూచించారు.అనంతరం పాఠశాలలో ఉన్న వసతులు,మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న,తహసిల్దార్ సరిత,ఎంపీడీవో రాధ,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పంటలు ఎండిపోతున్నా పట్టించుకునే నాధుడే లేడు

### రైతు బంధు ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం* చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



**ప్రజాపక్షం/గంగాధర:**బిఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్ల పాటు సకాలంలో నీళ్లు, యూరియా, రైతు బంధు కోసం ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతులు ఉన్నారని, ఎండలు ముదిరి పంటలు ఎండిపోయి రైతులు ఆందోళన చెందుతున్నా నీళ్లు ఇచ్చి ఆదుకోవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం దున్నపోతు మీద వానపడ్డ చందంగా వ్యవహరిస్తుందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆరోపించారు. గంగాధర మండలం గోపాల్‌రావుపల్లి గ్రామంలో ఎండిపోయిన పంట పొలాలను స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చొప్పదండ నియోజకవర్గంలో అనేక ప్రాంతాలలో సకాలంలో నీళ్లు అందక పంటలు ఎండిపోతున్నాయని, రైతులు ఆందోలన చెందుతున్నా ఈ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. నారాయణపూర్ కుడి కాల్వ పనులు బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేయడం జరిగిందని, దాని ద్వారా ఆ పరివాహక ప్రాంత రైతులకు నీళ్లు ఇచ్చే సోయి లేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణపూర్ రిజర్వాయర్ ద్వారా కొండాపూర్ మైసమ్మ చెరువు నింపి డి4 కాలువ ద్వారా ఈ ప్రాంత రైతులకు నీళ్లు ఇవ్వాలని, ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు మూడు దఫాలుగా ఎగ్గొట్టిన రైతుబంధు విలువ రూ.27 కోట్లు అని, చొప్పదండి నియోజకవర్గం చుట్టం ఇక్కడి స్థానిక ఎమ్మెల్యే పెద్ద పెద్ద డైలాగులతో కాలం వెళ్లదీస్తున్నాడే తప్ప ఆయన వల్ల ఒరిగిందేమీ లేదన్నారు. ఫోటోలకు ఫోజులు కొట్టుడు తప్ప ఆయన వల్ల నియోజకవర్గానిక ఒక్క రూపాయి లాభం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా సకాలంలో ఎండి పంటపొలాలకు ఎకరాన రూ.25 వేలు చొప్పున నష్టపరిహారం అందించి , నీళ్లు ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. లేని పక్షంలో రైతులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/నిజాంసాగర్:**జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు జుక్కల్ నియోజకవర్గ ంలోని మహ్మద్‌నగర్ మండలంలోని తెల్గాపూ ర్, హసన్‌పల్లి గ్రామాలలో పలు అభివృద్ధి ప నులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రా మ పంచాయతీ భవన నిర్మాణాలకు శంకుస్థాపనతో పాటు గాలీపూర్‌లో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు శంకుస్థాపన చేశారు. సుమారు 52 ల క్ష ల వ్యయంతో చేపడుతున్న ఆయా అభివృద్ధి ప నులకు శంకుస్థాపణ చేశారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలోని మౌళిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిదులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఆర్ఆర్‌లో ఫ్లేవర్ ఫియస్టా

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగ ఆద్వర్యంలో శుక్రవారం ఫ్లేవర్ ఫియస్టా పేరుతో విధ్యార్థులు తెలంగాణ సాంప్రదాయ వంటకాలను ప్రదర్శించారు. ఈకార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.రామకృష్ణ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులలో ఆహారం పట్ల అవగాహన, వివిధ ఆహార పదార్థాలలోని పోషకాలకు సంబంధించిన సమాచారం అందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైఫ్ సైన్సెస్‌కు చెందిన విధ్యార్థులు దాదాపు 60 రకాల వివిధ ఆహార పధార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె. కిరణ్మయి, వైస్ ప్రిన్సిపల్స్ టి.రాజయ్య, పి.నితిన్, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డితో పాటు జంతుశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ తోట మహేష్, డి.రవీంద్ర రావు, సమతా, ప్రీతి, చరణ్, కళాశాల అధ్యాపకులు, విధ్యార్థులు పాల్గొన్నారు. ఈ సంధర్భంగా జంతుశాస్త్ర విభాగాన్ని కళాశాల ప్రిన్సిపల్, టిజిసిజిటిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి అభినందించారు.

## అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లు పట్టివేత



**ప్రజాపక్షం/కొత్తపల్లి:**కరీంనగర్ రూరల్ పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బొమ్మకల్ గ్రామానికి చెందిన పోగుల సంపత్ అనే వ్యక్తి తన ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. బొమ్మకల్ గ్రామంలోని లారీ అసోసియేషన్ చౌరస్తా వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. తదుపరి చర్య నిమిత్తం కోర్టుకు పంపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంపటామని కరీంనగర్ రూరల్ సిఐ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

## శంకరపట్నంలో....



**ప్రజాపక్షం/శంకరపట్నం:**శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామ శివారులో శుక్రవారం అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకుని కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు కోర్కల్ గ్రామానికి చెందిన సంగి రాజు, నేదురు కనుకయ్య ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా కాచాపూర్ గ్రామ శివారులో పట్టుకుని ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కోరుట్లలో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం

### జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్

**ప్రజాపక్షం/కోరుట్ల :** రోడ్డు ప్రమాదాల నివారణను ప్రధాన లక్ష్యంగా తీసుకుని పోలీస్ శాఖ చేపట్టిన "అరైవ్ ఆలైవ్" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ వాహనాల డ్రైవర్ల కోసం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ గారు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఎస్పి అశోక్ కుమార్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టాలను గణనీయంగా తగ్గించాలనే లక్ష్యంతో రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా "Arrive Alive – A Campaign for Safer Roads in Telangana" అనే ప్రత్యేక రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని 1 st ఫేజ్ ని వియవంతగా పూర్తి చేసుకొని రెండవ ఫేజ్ ని ఈ నెల 22 నుంచి 28 వరకు జిల్లా వ్యాప్తంగా డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని ప్రజల్లో అలవాటు చేయడం, గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇందులో బాగంగా ఈరోజు వాహనాల డ్రైవర్ల కోసం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని అన్నారు.డ్రైవింగ్ సమయంలో స్పష్టమైన చూపు లేక పోతే, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్ సైన్ బోర్డులు, ముందున్న వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని ఎస్పీ గారు హెచ్చరించారు. అవసరమైన డ్రైవర్లకు తగిన సూచనలు ఇచ్చి,చూపు సమస్యలు గుర్తించిన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేయడంతో పాటు అవసరమైన మందులు కూడా పంపిణీ చేశారు. అవసరమైతే తదుపరి చికిత్స కోసం సంబంధిత ఆసుపత్రులకు రిఫర్ చేసే ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు. డిఎస్పి రాములు కోరుట్ల సి.ఐ సురేష్, ఎస్.ఐ చిరంజీవి, ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ రేగొండ రాజేష్,డాక్టర్ లు సంపత్ కుమార్ ,సుమన్, సమీర్,లయన్స్ క్లబ్ అధ్యక్షులు – జీవన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరుమల గంగాధర్ వసంత, వైస్ చైర్మన్ షాహిద్ ఉల్ అహద్, కార్యదర్శి ,పోలీస్ సిబ్బంది, 200 మంది డ్రైవర్లు పాల్గొన్నారు.

## కౌమార విద్యపై ఉపాధ్యాయులకు అవగాహన

**ప్రజాపక్షం/కరీంనగర్:**జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో జిల్లా స్థాయిలో కౌమార విద్యపై ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యార్థులకు పోస్టర్ మేళా పోటీలు కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించారు. జిల్లాలోని 63 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 4 కేజీబీవీ, 5 మోడల్ స్కూల్స్ , 8 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కౌమార విద్యా కార్యక్రమంలో భాగంగా కౌమార దశలో బాలబాలికలకు కలిగే శారీరక, మానసిక, భావోద్వేగ, సామాజిక మార్పుల గురించి అవగాహన కల్పించారు.ఈ దశలో వారికి అవసరమైన జీవన నైపుణ్యాలపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఎంహెచ్ఓ హెచ్ఐవి ఆర్టిఐ, ఎస్టీఐఐ సంక్రమిత వ్యాధుల గురించి, మాదకద్రవ్యాల దుర్వినియోగం గురించి, లైంగిక వేధింపుల నివారణ గురించి ఆరోగ్యము, పరిశుభ్రత గురించి, భావవ్యక్తీకరణ ద్వారా వ్యక్తుల మధ్య ఆరోగ్యవంతమైన సంబంధాలు ఏర్పాటు చేసుకోవడం మరియు కౌమారానికి సంబంధించిన వివిధ అంశాలపై పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులకు పోస్టర్ మేళా నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు మరియు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధ, విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ కోఆర్డినేటర్ కె అశోక్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్ష శిబిరం



**ప్రజాపక్షం/కరీంనగర్:**రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పోలీసులు చేపట్టిన Arrive Alive కార్యక్రమంలో భాగంగా డ్రై వర్ల కోసం నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయవంతమైంది. పోలీస్ శాఖ,లయన్స్ క్లబ్ ఆఫ్ బాలాజీనగర్ సంయుక్తంగా నిర్వహించిన మెగా శిబిరంలో 448 మ ంది డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకున్నారు. నగరంలో ని ప్రముఖ కంటి ఆసుపత్రులు ఈ శిబిరంలో పాల్గొని డ్రైవర్లకు అత్యాధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించారు. ప రీక్షల అనంతరం అవసరమైన డ్రైవర్లకు లయన్స్ క్లబ్ ఆఫ్ బాలాజీనగర్ తరఫున 200 కళ్లద్దాలు, 200 కంటి చుక్కల మందులను ఉచితంగా అందజేశారు. అలాగే, రేకుర్తి కంటి హాస్పిటల్ సుమారు 50 మందికి ఉచిత సర్జరీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, సురక్షిత చూపు సురక్షిత డ్రైవింగ్ సురక్షిత గమ్యం అనే నినాదంతో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. డ్రైవర్లకు కంటి చూపు సరిగ్గా ఉండటం వ ల్ల రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సు నీల్, అడిషనల్ డీసీపీ భీం రావు, ఏసీపీ లు వెంకటస్వామి, విజయకుమార్, ఇన్స్పెక్టర్లు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బాలాజీనగర్ తరఫున ప్రెసిడెంట్ లయన్ ఏ.రవీందర్ రెడ్డి, వి.రాధాకృష్ణ రెడ్డి, వెంకట రమణ రెడ్డి, గౌతమ్ మరియు హెచ్.రాజిరెడ్డి పాల్గొన్నారు.

## కవితపై క్లీన్ చీట్ ఇచ్చినందుకు జాగృతి నాయకుల సంబరాలు



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితపై కోర్టు క్లీన్ చీట్ ఇచ్చినందుకు కరీంనగర్‌లో జాగృతి ఆద్వర్యంలో టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ కవిపై పెట్టిన తప్పుడు కేసుతో ఇబ్బందులు పెట్టాలని చూస్తే ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు కేసును కొట్టివేయడం సంతోషకరమన్నారు. సిబిఐ పెట్టిన లిక్కర్ కేసులో స్కాం లేదని కోర్టు తీర్పు ఇచ్చిందని వారు పేర్కొన్నారు. ఇదంతా కేంద్ర ప్రభుత్వం కావాలని రాజకీయంగా దెబ్బకొట్టడం కోసమే తప్పుడు కేసులకు పాల్పడిందని, ఈ కేసులో కవితతోపాటు కేజ్రీవాల్, మనీష్ సిసోసిడా అందరికీ క్లీన్ చీట్ వచ్చిందని అన్నారు. నిజం నిప్పులాంటిదని, ఎప్పటికైనా ధర్మం గెలుస్తుందనడానికి నిదర్శనమన్నారు. తెలంగాణ ఆడబిడ్డపై అక్రమ కేసులు పెట్టిన కేంద్ర ప్రభుత్వానికి న్యాయస్థానంలో చెప్పుదెబ్బలాంటి తీర్పు వచ్చిందని, తెలంగాణ ప్రజలు రాబోయే కాలంలో అక్రమ కేసులు పెట్టిన కేంద్ర ప్రభుత్వాన్ని ఓటుతో బుద్ది చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, ఆదివాసం విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, జిల్లా మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అక్కం శివరాణి, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, జిల్లా సీనియర్ నాయకులు వరాల శ్రీనివాస్, రంగరవేణి లక్ష్మ ణ్, పిన్నింటి సంగీత రెడ్డి, యండి సల్క, పూదరి రాజేశ్వరి గౌడ్, కుర్ర పోచయ్య, గాలిపల్లి రత్నాకర్ చారి, యండి హుస్సేన్ , జంగ అపర్ణ, బండ అశోక్, సంతోష్ యాదవ్, కుర్ర కౌసిక్, బాసవేణి రాజేందర్, కొత్తూరి రఘు, గుండేటి తిరుపతి, పూసాల పవన్, ఎండి రజీ తదితరులున్నారు.

## జనసేన సభ్యత్వ నమోదులో కరీంనగర్‌ను అగ్రభాగాన నిలుపుతాం

### జనసేన పార్టీ సభ్యత్వ నమోదు పార్లమెంట్ కో–ఆర్డినేటర్ బేతి మహేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రారంభించి , సభ్యత్వ నమోదుకు రూ.2 కోట్లు విరాళం అందించి, తొలి సభ్యత్వాన్ని పవన్ కళ్యాణ్ తీసుకున్నారని నూతనంగా నియామకమైన కరీంనగర్ పార్లమెంట్ సభ్యత్వ నమోదు కో ఆర్డినేటర్ బేతి మహేందర్‌రెడ్డి మీడియా సమావేశంలో తెలిపారు. జనసేన పార్టీ భావజాలాన్ని లోతుగా అర్దం చేసుకుని పార్టీ సిద్దాంతాలు, ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసేందుకు ఎవరైతే ముందుకు వచ్చి పార్టీ సభ్యత్వం తీసుకుంటారో వారిని ఉద్యమి గా పార్టీ పోరాటానికి మరింత బలాన్ని అందించి నవతరంలో ప్రేరణ కలిగించి పార్టీ సిద్దాంతలకి ఆకర్షితులను చేసి సభ్యత్వ నమోదు చేసేవారిని సాధక్‌గా, జనసేన పార్టీ చేస్తున్న ప్రజారాజకీయ పోరాటానికి పరోక్షంగా తమ వంతు సమయాన్ని, ఆర్థిక, సాంకేతిక, సేవా, మేథాశక్తిని సహాయ సహకారాలు అందిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసేవారిని ప్రధాతగా పిలుస్తామని పవన్ కళ్యాణ్ ప్రకటించడం జరిగిందని తెలిపారు. జనసేన పార్టీ సభ్యత్వ నమోదులో ప్రైవేట్ ఉద్యోగులను, వివిధ రకాల యూనియన్‌లను వివిధ కుల సంఘాలను, చిన్న వ్యాపారాలు , వీధి వ్యాపారాలు, వర్తక, వాణిజ్య వ్యాపారాలు చేసుకునే వారి నుంచి కూలీ పనులు చేసుకునే వారిదాకా, యువత, మహిళలను భారీ సంఖ్యలో ఈ సభ్యత్వ నమోదు ప్రక్రియలో భాగస్వాములు చేయడమే లక్ష్యంగా సభ్యత్వ నమోదు చేసుకున్న వారికి రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామని, ఇంత మొత్తం బీమా ఏ రాజకీయ పార్టీ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. కరీంనగర్‌ను తెలంగాణలోనే సభ్యత్వ నమోదులో అగ్రబాగాన నిలుపుతామని తెలిపారు. అభివృద్ధి ముసుగులో జరుగుతున్న పనులలో అవకతవకలపై, అవినీతి అక్రమాలపై ఎప్పటికప్పుడు నిలదీస్తూ ప్రజా సమస్యలపై పోరాటం చేయడమే లక్ష్యంగా జనసేన పార్టీ పనిచేస్తుందన్నారు. నగరపాలక సంస్థ మొదటి సర్వసభ్య సమావేశంలో అడ్డంగా ఉన్న ఈద్గా గోడను తొలగించాలని తీర్మాణం చేసి ఆమోదం తెలిపే విదంగా మంత్రి బండి సంజయ్ కుమార్ పాలకవర్గానికి సూచించాలని డిమాండ్ చేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జనసేన పార్టీ నాయకులు కందుల రాజిరెడ్డి, శివారెడ్డి, పెంటాల మహేష్, పొన్నాల తిరుపతి, వొడ్నాల రాజు, జంగ మహేష్, వీర్ల శ్రీనివాస్, సిరిసిల్ల రాము, కందకట్ల స్వరూప, చింటు తదితరులున్నారు.

## అంతర్జాతీయ మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో ఆల్ఫోర్స్ విద్యార్థులకు బంగారు పతకాలు



**ప్రజాపక్షం/కొత్తపల్లి:**కరీంనగర్‌లోని కొత్తపల్లిలోగల అల్ఫోర్స్ ఇటెక్నో స్కూల్ విధ్యార్థులు అంతర్జాతీయ మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో బంగారు పతకాలు సాధించారు. ఈ సంధర్భంగా విధ్యార్థులను అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అభినందించి మాట్లాడారు. విధ్యార్థులకు గణిత శాస్త్రం పట్ల పట్టు సాధింపచేయడానికి, వాటిలోని విషయాల పట్ల సంపూర్ణంగా అవగాహన కలిగించడానికి వివిధ స్థాయిలలో పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విధ్యార్థులకు అత్తుత్తమ శిక్షణతో ప్రశంసనీయమైన విజయాలు సాధించడం జరుగుతుందని హర్షం వ్యక్తం చేస్తూ ఇటీవల కాలంలో ఎస్ఓఎఫ్ వారు నిర్వహించినటువంటి అంతర్జాతీయ మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో పాఠశాలకు చెందిన పలువురు విధ్యార్థులు అసమాన ప్రతిభను కనబరిచారని తెలిపారు. బంగారు పతకాలను సైతం కైవసం చేసుకోవడం గొప్ప విషయమని తెలిపారు. విజేతలు వశ్విత, అక్షయ(3వ), ఎస్.అయాన్, జతిన్ సిద్దార్థ, వి.తేజస్ (4వ), పి.మయాంక్ రెడ్డి, పి.రిత్విక్‌రెడ్డి, పి.సాద్వని(5వ), బి.కార్తికేయ గౌడ్, కె.క్రిసిక్ ప్రిన్స్ , కె.సమర్ద్ (6వ), బి.స్నితిక్, జి.సాయి ప్రణవి, జి.సహాన్స్ (7వ) విధ్యార్థులు బంగారు పతకాలు గెలుచుకున్నారని హర్షం వ్యక్తం చేస్తూ విజేతలకు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# నిజం గెలిచింది.. కవితకు న్యాయం జరిగింది

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : కల్వకుంట్ల కవితకు ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో భారీ ఊరట లభించడంతో జగిత్యాల జిల్లా కేంద్రంలో తహసీల్ చౌరస్తా వద్ద శుక్రవారం పెద్ద ఎత్తున జాగృతి నాయకులు, కార్యకర్తలు పాల్గొని డప్పుల చప్పులతో భారీ బాణా సంచా పేల్చి కవితకు మద్దతుగా "నిజం గెలిచింది కవితమ్మకు న్యాయం జరిగింది" అంటూ నినాదాలతో ప్రాంతం మార్మోగింది. నాయకులు ప్రజలకు స్వీట్లు పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాలలో జాగృతి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినచిత్రా మిశ్రా

ప్రజాపక్షం/కరీంనగర్:కరీంనగర్ జిల్లా నూతన కలెక్టర్ గా చిత్రా మిశ్రా శుక్రవారం కలెక్టరేట్ ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చిత్రా మిశ్రాను కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఏవో సుధాకర్, పలువురు జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శివకుమార్, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం లను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. వార్తకు ఫోటో ఉంది

## నూతన కలెక్టర్‌ను కలిసిన ఐఎంఎ అధ్యక్షురాలు



ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:నూతనంగా బదిలీపై వచ్చిన కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ ఆకుల శైలజ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబుకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ మహేష్, ట్రెజరర్ డాక్టర్ నీలిమ ఉన్నారు.

# ప్రధాన రోడ్డుకు సెంట్రల్ లైటింగ్ సౌకర్యం కల్పించాలి

### సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు తొడుపునూరి రమేష్ కుమార్



ప్రజాపక్షం/పెద్దపల్లి :రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆరవ డివిజన్ జనగామ ప్రధాన రోడ్డు కు నూతనంగా సెంట్రల్ లైటింగ్ సౌకర్యం కల్పించాలని, అదే విధంగా రోడ్డు వెడల్పు పెరిగినందున స్వాగత కమాన్ పరిధి పెంచే విధంగా సింగరేణి యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేష్ కుమార్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ ప్రధాన రోడ్డు లో ఉన్న స్వాగత కమాన్ వద్ద ఆయన డివిజన్ ప్రజలతో కలిసి రోడ్డు ను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జనగామ ప్రధాన రోడ్డు శిథిలావస్థలో ఉంటే సింగరేణి యాజమాన్యం ప్రభావిత డివిజన్ పేరుతో సి.ఎస్.ఆర్ నిధులతో కొత్తగా రోడ్డు వేసి పూర్తి చేసినందుకు సింగరేణి యాజమాన్యం కు జనగామ డివిజన్ ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆయన అన్నారు. ప్రధాన రోడ్డు పూర్తి ఐనందున రాత్రి పూట ఈ రోడ్డు పై వెళ్ళే వాహన దారులు, ప్రజలు లైటింగ్ సౌకర్యం లేక చీకటి వల్ల ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. గురువారం రాత్రి పూట ఇట్టి రోడ్డు పై లారీ , టూ వీలర్ వాహనం వెళుతుండగా అధిక వేగం ,చీకటి వల్ల ఒక దాని కొకటి దగ్గర రావడం తో తృటిలో ప్రమాదం తప్పిందని డివిజన్ ప్రజలు తెలిపారని ఆయన అన్నారు. కనుక సెంట్రల్ లైటింగ్ వెంటనే ఏర్పాటు చేయాలని, అదేవిధంగా రోడ్డు వెడల్పు పెరిగినందున స్వాగత కమాన్‌ను పరిధి పెంచాలని ఆయన సింగరేణి యాజమాన్యానికి , మున్సిపల్ కార్పొరేషన్ కు ఒక ప్రకటన లో కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో జనగామ డివిజన్ ముఖ్యులు గుండబోయిన పృథ్వీరాజ్, గోలివాడ రాజబాబు, డాక్టర్ చక్రపాణి తదితరులు ఉన్నారు.

# మధ్య మానేరు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : మధ్య మానేరు ప్రాజెక్ట్ ముంపు గ్రామాల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు గుంటి వేణు జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ నాగరాజులు కలిసి సూపరింటెండెంట్ కు వినతి పత్రం అందజేశారు. ఇండస్ట్రీ కారిడార్ ఏర్పాటు చేసి నిర్వాసితులకు యువతి యువకులకు స్వయం ఉపాధి ఎంప్లాయిమెంట్ కల్పించాలనీ,ఆర్ అండ్ ఆర్ పట్టా ప్యాకేజ్ పరిహారం ఇప్పించాలనీ తెలిపారు. ఇండ్లకు, భూములకు సంబంధించి నేటి వరకు నష్టపరిహారం రాలేదని, 5 లక్షల 4 వేలు నష్టపరిహారం ఇస్తానన్న హామీని నిలబెట్టుకోవాలని కోరారు. సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు 50 సంవత్సరాలు దాటిన మహిళలకు పురుషులకు ఎలాంటి కటాఫ్ డేట్లు లేకుండా ప్రత్యేకమైన పెన్షన్ ఇప్పించాలని ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు.

# కోరుట్ల సీనియర్ వైద్యుడు బిజెపిలో చేరిక

### రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు కండువా కప్పి క్రియాశీల సభ్యత్వం ప్రదానం



ప్రజాపక్షం/కోరుట్ల: కోరుట్ల పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ వైద్యుడు. డా. వై.అనూప్ రావు బిఆర్ఎస్ పార్టీ నుంచి భారతీయ జనతా పార్టీలో శుక్రవారం అధికారికంగా చేరారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పార్టీ కండువా కప్పి ఆయనకు క్రియాశీల సభ్యత్వాన్ని అందజేశారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు సమక్షంలో ఈ చేరిక కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. భోగ శ్రావణి, రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీప్ ఆచారి కూడా పాల్గొన్నారు.కోరుట్ల నియోజకవర్గం నుంచి సుమారు 350 మంది కార్యకర్తలు,నాయకులు 7080 కార్లలో కోరుట్లలోని అనూప్ రావు హాస్పిటల్ నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్లి ఈ చేరిక కార్యక్రమంలో పాల్గొన్నారు. కోరుట్ల మరియు మెట్‌పల్లి ప్రాంతాలకు చెందిన నూతనంగా గెలిచిన కౌన్సిలర్లు, మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ప్రజా సేవే లక్ష్యంగా.. ప్రత్యక్ష రాజకీయాల్లోకి డాక్టర్ అనూప్ రావు ఈ సందర్భంగా డా. అనూప్ రావు మాట్లాడుతూ దేశాభివృద్ధి, ప్రజా సేవే లక్ష్యంగా బీజేపీలో చేరినట్లు తెలిపారు. కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీతో కలిసి కృషి చేస్తానని, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఇక నుంచి తాను ప్రత్యక్షంగా రాజకీయాల్లో కీలక పాత్ర పోషించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసిన కౌన్సిలర్లు

ప్రజాపక్షం/చొప్పదండి:చొప్పదండి బిజెపి పట్టణ అధ్యక్షుడు 3 వార్డు కౌన్సిలర్ చిల్ల అర్చన శ్రావణ్ ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు కౌన్సిలర్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. 8 వార్డు కౌన్సిలర్ రాజన్నల రాజు, 13వ వార్డు కౌన్సిలర్ జిట్ట మంగ కుమార్‌లతో కలిసి చొప్పదండి మున్సిపాలిటీకి సంబంధించిన ప్రధాన సమస్యలు, అభివృద్ధి అవసరాలు, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించారు. చొప్పదండి ప్రాంత అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని వివరించగా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని బండి సంజయ్ హామీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా జరుగుతున్న ఈ చర్యలు చొప్పదండ మున్సిపాలిటీ అభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## వివోభవన నిర్మాణపనులు పరిశీలించిన సర్పంచ్

ప్రజాపక్షం/వీర్నపల్లి:వీర్నపల్లి మండల కేంద్రంలో సర్పంచ్ మల్లార పుజ్యోత్స్న గ్రామమహిళ సమాఖ్యభవన నిర్మాణపనులను శుక్రవారం పరిశీలించారు.పనులు నాణ్యతగా వేగవంతంగా పూర్తి చేయడానికి కృషిచేస్తామన్నారు.మహిళల ఎన్నోరోజుల కలను మరికొద్ది రోజులలో నేరవేరనుందని అన్నారు.కార్యక్రమంలో మాల్లారపు అరుణ్‌కుమార్,జక్కులనరేష్,వార్డు సభ్యులు గంగాదరి సంజీవ్,తదీతరులున్నారు.

## రోడ్డుప్రమాదాల నివారణే లక్ష్యం..

### రాజన్నసిరిసిల్లా ఎస్‌పి మహేష్‌గీతే

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా వాహనాల డ్రైవర్లకు ఉచితకంటి వైద్యశిబిరం ఎల్లారెడ్డిపేటలో నిర్వహించారు.శుక్రవారం అశ్విని ఆసుపత్రి నిర్వాహకుల సహకారంతో ఉచిత కంటి వైద్యం చేయించి కళ్ళద్దాలు,మందులు అందచేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డుప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు.ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రతిపౌరుడు భాధ్యతగా వ్యవహరించాలని అన్నారు.స్పష్టమైన చూపు లేకపోవడం ప్రమాదాలకు కూడ ఓకారణం అవుతుందని చెప్పారు.ఓవర్‌లోడింగ్,ర్యాష్‌డైవింగ్,సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తే కఠినచర్యలు తప్పవన్నారు.దూర ప్రయాణాలు చేసి అలసటగా ఉన్నప్పుడు విశ్రాంతి తీసుకోవాలన్నారు.అనంతరం ఆసుపత్రి యాజమాన్యాన్ని,డాక్టర్ అభినయ్‌ను జిల్లా ఎస్పీ మహేష్‌గీతే అభినందించారు.కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి,సీఐ శ్రీనివాస్‌గౌడ్,ఎస్సై రాహుల్ రెడ్డి,,లక్ష్మణ్ సిబ్బంది ఎస్పీ వెంట ఉన్నారు.

## క్రమశిక్షణతోనే విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోగలరు




ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్, శివ వీధి ఆల్ఫోర్స్ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 10వ, 9వ తరగతి విద్యార్థుల కోసం "జాయ్" పేరుతో ఆత్మీయ వీడ్కోలు సభను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి, మంచి ప్రయోజకులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. నేటి పోటీ ప్రపంచంలో ఉన్నత స్థాయికి రావాలంటే జీవితంలో క్రమశిక్షణను అలవర్చుకోవాలని, తల్లిదండ్రులు ఉపాధ్యాయుల పట్ల గౌరవంగా మెలగాలని వి.నరేందర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు తమ పాఠశాల అనుభవాలను, మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. జూనియర్ విద్యార్థులు సీనియర్లకు పాటలు, నృత్యాలతో ఉత్సాహంగా అలరించారు.ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి.నరేందర్ రెడ్డి, ఉపాధ్యాయుల చేతుల మీదుగా విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి,భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బాలసాహిత్య సృజనకు ప్రోత్సాహమే లక్ష్యం

### జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బడిపిల్లల కథలకు ఆహ్వానం డిఇఒ రాము

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు కథా రచనలను ఆహ్వానిస్తున్నట్లు జగిత్యాల జిల్లా విద్యాశాఖాధికారి కె. రాము ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ (టీఎన్‌జీవో) స్కూల్ ఎడ్యుకేషన్ జిల్లా శాఖ అధ్యక్షులు కె. సుగుణాకర్ కు డీఈవో చేతుల మీదుగా రికగ్నైజ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ జగిత్యాల జిల్లా శాఖ పక్షాన జిల్లా అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్ భగవద్గీతను ప్రదానం చేపించారు. అలాగే సుగుణాకర్ చేస్తున్న సేవలను, జాతీయభావనను కొనియాడుతూ డిఈవో,ఆర్యుపిపి జిల్లా శాఖ అధ్యక్షులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ,విద్యార్థులు తమకు నచ్చిన ఏదైనా ఒక అంశంపై ఒక పేజీకి మించకుండా తెలుగు, హిందీ లేదా ఇంగ్లీష్ భాషల్లో కథలు రాసి పంపాలని సూచించారు. కథల్లో నైతిక విలువలు, మానవతా భావాలు, నీతి–నిజాయితీ వంటి అంశాలు ప్రతిఫలించాలని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు. పాఠశాల స్థాయిలోనే కథా రచన అలవాటు పెంపొందితే భవిష్యత్తులో వారు మంచి రచయితలుగా ఎదగగలరని వారు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి పాఠశాల నుంచి కనీసం ఐదు కథలను తప్పనిసరిగా పంపాలని ఆయన సూచించారు.అందిన కథలను పరిశీలించి ఉత్తమ కథలను ఎంపిక చేసి మార్చి మొదటి వారంలో పుస్తకరూపంలో వెలువరించనున్నట్లు డి.ఈ.ఓ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారంగా బాలసాహిత్య సృజనకు ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు డి.ఈ.ఓ వెల్లడించారు. కథలను మార్చి 15వ తేదీలోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పంపాలని సూచించారు. వివరాలకు 8985348424 నంబర్‌కు లేదా ఎ.ఎమ్.ఓ ఎం.చంద్రశేఖర్ రెడ్డిని సంప్రదించవచ్చని జగిత్యాల జిల్లా విద్యాశాఖాధికారి కె. రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యుపిపి జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఎనగందుల రాజేంద్రప్రసాద్, గౌరవ అధ్యక్షులు అలకట్టు సత్యనారాయణ, వేల్పుల రఘు,తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన



ప్రజాపక్షం/ధర్మపురి : జగిత్యాల జిల్లా ధర్మపురి పురపాలక శాఖ పరిధిలోని 10వ వార్డులో ఇందిరమ్మ గృహనిర్మాణ పనులకు కౌన్సిలర్ సంగి ఆనంద్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.ఇందిరమ్మ ఇంటి పథకం లబ్ధిదారులు10వ వార్డుకు చెందిన తరాల లక్ష్మి గంగన్న,వేముల రమ లకు చెందిన ఇళ్ల నిర్మాణ పనులను కౌన్సిలర్ సంగి ఆనంద్ ముగ్గు పోసి ప్రారంభించారు. కౌన్సిలర్ ఆనంద్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరి స్వంత ఇంటి కల సాకారం చేయాలన్నదే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ జింజిరికాని సువర్ణ శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ మధుశ్రీ,లబ్ధిదారులు పాల్గొన్నారు.

## 3న రాజన్న, భీమన్న ఆలయాల మూసివేత

ప్రజాపక్షం/ వేములవాడ: వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని వచ్చే మార్చి 3వ తేదీన మూసివేస్తున్నట్లు దేవస్థాన అధికారులు వెల్లడించారు. మార్చి 3వ తేదీ మంగళవారం రోజున కేతుగ్రస్త చంద్రగ్రహణం సంభవించనున్న కారణంతో ఉదయం గంటలు 6:15 నుండి రాత్రి 07:15 వరకు ఈ రెండు ప్రధాన ఆలయాలతో పాటు అన్ని అనుబంధ ఆలయాల ద్వారాలను పూర్తిగా మూసివేస్తారు. గ్రహణం అనంతరం రాత్రి 7:15 గంటలకు ఆలయ శుద్ధి, పుణ్యాహవచనము, సంప్రోక్షణ వంటి క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఆ తర్వాతే భక్తులకు స్వామి వారి దర్శన భాగ్యం కల్పిస్తామని అధికారులు స్పష్టం చేశారు. అయితే గ్రహణానికి ముందు తెల్లవారుజామున ఆలయంలో జరిగే సుప్రభాత సేవ, ప్రాతఃకాల పూజలు యధావిధిగా జరుగుతాయని, ఉదయం 6 గంటల తర్వాతే దర్శనాలు నిలిపివేస్తామని ప్రకటించారు. కావున భీమన్న దర్శనం కోసం వచ్చే భక్తులు ఈ మార్పును గమనించి సహకరించాలని కోరారు.

## ఉత్తమ క్రీడాకారులకు ప్రత్యేక అభినందనలు

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:సిఎం కప్ 2026 రాష్ట్రస్థాయి క్రీడ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాణించిన క్రీడాకారులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేక అభినందనలు తెలిపారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలలో రాణించిన విద్యార్థులను సన్మానించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎంకప్ రాష్ట్రస్థాయి పోటీలలో పెద్దపల్లి జిల్లా నుంచి వెళ్లిన 22 మంది విద్యార్థులు 4 బంగారు పతకాలు,8 వెండి పతకాలు, 10 కంచు పతకాలు గెలుచుకున్నారని కలెక్టర్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి సురేష్, పేట ప్రెసిడెంట్ సురేందర్, పేట రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శోభరాణి, ఆర్చరీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సెక్రటరీ శ్రీనివాస్, వివిధ క్రీడల కోచ్ లు తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపిన ఎఐటియుసి నాయకులు




ప్రజాపక్షం/పెద్దపల్లి :గోదావరిఖని కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ (సి.ఎం.పి.ఎఫ్) కమీషనర్ హరిపచౌరి ఈ నెల 28 న పదవి విరమణ చేస్తున్న సందర్భంగా గుర్తింపు సంఘం ఏఐటియుసి ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖని సి.ఎం.పి.ఎఫ్ ఆఫీస్ ఆవరణలో జరిగిన రిటైర్మెంట్ ఫంక్షన్ కార్యక్రమంలో కమిషనర్ దంపతులకు నాయకులు పూల బోకే అందించి శాలువా కప్పి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు కమిషనర్ హరిపచౌరి సింగరేణి కార్మికులకు చేసిన సేవలను కొనియాడుతూ వారి శేష జీవితం ఆనందంగా ఆరోగ్యం గా ఉండాలని ఆకాంక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శులు వై.వి.రావు, మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శులు కందుకూరి రాజారత్నం, జూపాక రాంచందర్, అర్జీ టూ బ్రాంచి కార్యదర్శి జీగురు రవిందర్,నాయకులు అన్నారావు,గంగాధర్, ఎం.ఎ.గౌస్, ఎజ్జ రాజయ్య, ఆఫీస్ కార్యదర్శి రమేశ్ కుమార్ పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన విద్యాశాఖ ప్యానెల్ బృందం



ప్రజాపక్షం/వేములవాడటౌన్: వేములవాడ అర్బన్ మండలం అనుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్యానెల్ అబ్జర్వర్ బృందం శుక్రవారం సందర్శించారు. పాఠశాలలోని విద్యా ప్రమాణాలు, బోధనా పద్ధతులు మరియు మౌలిక సదుపాయాలను ఈ బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. తనిఖీల్లో భాగంగా తరగతి గదులకు వెళ్లి ఉపాధ్యాయుల బోధనా తీరును ప్యానెల్ సభ్యులు పర్యవేక్షించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని అంచనా వేయడానికి బేస్ లైన్, మిడ్ లైన్ ఎస్ఏ పరీక్షా పత్రాలను, ఎఫ్ఏ రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని పెంచేందుకు ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు అందించారు. కేవలం పాఠ్యాంశాలే కాకుండా, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్ వినియోగాన్ని బృందం అడిగి తెలుసుకున్నారు. క్రీడల నిర్వహణ , గేమ్స్ మెటీరియల్‌ను పరిశీలించి, విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ టీం అబ్జర్వర్ పులి రాజా గౌడ్, సభ్యులు దూష సంతోష్, మల్లేశం, శ్రీనివాస్, యోగేందర్, సుస్మిత, రవీందర్ రావు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. విట్టల్ తో పాటు ఉపాధ్యాయులు కవిత, రమేష్, దేవేందర్, మానువాడ శంకర్, కామిని రవీందర్, రజిత, రమేష్, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వార్డు సభ్యుల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మహేష్

ప్రజాపక్షం/జగిత్యాలటౌన్ :తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా కొడిమ్యాల మండలం నమిలకొండ గ్రామ వార్డు సభ్యుడు పబ్బ మహేష్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు అతికం రాజశేఖర్ గౌడ్ శుక్రవారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని వార్డు సభ్యుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర అధ్యక్షుడు ఆదేశించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ జిల్లాలోని వార్డు సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని, రాష్ట్ర సంక్షేమ సంఘం నిబంధలకు అనుగుణంగా పనిచేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు అతికం రాజశేఖర్ గౌడ్‌తో పాటు జిల్లా గౌడ సంఘం నాయకులకు, వార్డు సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## రంజాన్ పడుగకు ప్రత్యేక ఏర్పాట్లు



ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా కేంద్రంలో ముస్లిం సోదరలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మసీదులు, ప్రార్థనా స్థలాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ పేర్కొన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని మున్సిపల్ ఆధ్వర్యంలో మసీదులకు, ప్రార్థనా స్థలాలకు ప్రత్యేక డస్ట్‌బిన్స్, బ్లీచింగ్ పౌడర్ ప్యాకెట్లు పంపిణీ కార్యక్రమాన్ని చైర్ పర్సన్ వాణి చేపట్టారు. అనంతరం రంజాన్ సందర్భంగా చేపట్టాల్సిన పనులపై అధికారులకు పలు సూచనలు చేసి మాట్లాడారు. మున్సిపల్ ఆధ్వర్యంలో రంజాన్ మాసం పూర్తయ్యే వరకు ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు వివరించారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని కోదండ రామాలయంలో చైర్ పర్సన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంతో వైస్ చైర్ పర్సన్ జీనత్ పర్వీన్ మున్నా, కమిషనర్ స్పందన, కౌన్సిలర్లు ప్రశాంత్ రావు, గంగలక్ష్మి, అనీస్ కుతీజా అహ్మద్, దుమాల రాజ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## ముత్యంపేట గ్రామ అభివృద్ధికి ముందుంటాం

ప్రజాపక్షం/మల్లాపూర్ :ముత్యంపేట గ్రామ అభివృద్ధికి ముందుండి కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం గ్రామంలో నూతనంగా నిర్మించే గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి స్థానిక సర్పంచ్ తేలు నరేష్ ,పాలకవర్గ సభ్యులతో కలిసి ఆయన భూమి పూజ చేసి ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలో నిర్మించే మూడు మహిళ సమైక్య సంఘ భవనాల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని జువ్వాడి అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తేలు నరేష్, ఉప సర్పంచ్ పోతయ్య, కిసాన్ జిల్లా అధ్యక్షుడు జలపతి రెడ్డి, స్థానిక నాయకులు మహేష్ రెడ్డి, భూమారెడ్డి గంగా నరసయ్య, పాలకవర్గ సభ్యులు కాంగ్రెస్ నాయకులు,తదితరులు ఉన్నారు.

## వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాపక్షం/ధర్మపురి : సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం,జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మి నృసింహస్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామివారల వార్షిక బ్రహ్మోత్సవాలు (జాతర) శుక్రవారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఈ జాతర ఉత్సవాలు ఈ నెల 27 నుండి మార్చి 11 వరకు 13 రోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాల ప్రారంభ వేడుకగా సాంప్రదాయబద్ధంగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, కమిటీ సభ్యులు, అర్చకులు బ్రహ్మోత్సవాల కార్యక్రమాల నిర్వాహకులైన యాజ్ఞికులు కందాలై పురుషోత్తమచార్యులు స్వగృహం కు మేళతాళాలతో వెళ్లి జాతర కృతువు నిర్వహించాల్సిందిగా కోరుతూ పట్టువస్త్రాలు అందించి దేవస్థానానికి ఆహ్వానించారు. సాయంత్రం వేళలో శ్రీ యోగ,ఉగ్ర నృసింహస్వామివారలను పల్లకీ సేవలో చింతామణి చెరువు కట్టపైకి తీసుకువచ్చి ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేసిన వేదిక వద్ద వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ,నంబి శ్రీనివాస చార్యులు,నేరేళ్ల శ్రీనివాస చార్యులు ఆధ్వర్యంలో పుట్టబంగారం సేకరణ కార్యక్రమంలో భాగంగా మంత్ర పుష్పం,మంగళహార తి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం పుట్ట బంగారం (మృత్ సంగ్రహణం)లో భాగంగా మ ట్టిని సేకరించారు.నిజామాబాద్, ఆర్మూర్ ప్రాంతాలనుండి తరలివచ్చిన మహిళా భక్తులు నృసింహస్వామి వారి పాటలు పాడుతూ భక్తితో మట్టిని తీసుకెళ్లారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ ముఖ్య అతిథిగా హా జరై పూజాదికాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సంకటాల శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, సభ్యులు స్తంభంకాడి గణేష్,బొల్లారపు పోచయ్య, రాపర్తి సాయి కిరణ్, గుడ్ల రవీందర్, నేదునూరి శ్రీధర్,వొజ్జల సౌజన్య, మందుల మల్లేష్,సంబెట తిరుపతి, అవ్వ సుధాకర్, ఎక్స్ ఆఫీషియో సభ్యులు నేరేళ్ల శ్రీనివాస చార్యులు,మున్సిపల్ చైర్పర్సన్ వేముల నాగలక్ష్మి ,వైస్ చైర్మన్ ఐ.రామయ్య, నాయకులు ఎస్. దినేష్, వేముల రాజు,భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు స్వామివారి కళ్యాణ మహోత్సవం: ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహాని బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రధాన వేడుకైన శ్రీ యోగానంద, శ్రీ ఉగ్ర నరసింహ స్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి వారల కళ్యాణ మహోత్సవం శనివారం సాయంత్రం స్థానిక బ్రాహ్మణ సంఘం ప్రక్కనున్న శ్రీమఠం స్థలంలో అత్యంత వైభవంగా జరగనుంది. ఈ వేడుక కోసం కళ్యాణ వేదికను అత్యంత దేదీప్యమానంగా,పుష్పాలంకరణతో అందంగా అలంకరిస్తున్నారు. దీని కోసం సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మ ణ్ కుమార్,జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలతో దేవ స్థానం, మున్సిపల్, పోలీసు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పక్షాన స్వామి వారికి పట్టు వస్త్రాలు తలంబ్రాలను జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ తీసుకురానున్నారు.దేవస్థానం ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్,కలెక్టర్ సత్యప్రసాద్ లు ప్రారంభించనున్నారు.

## అంగరంగ వైభవంగా లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణం

ప్రజాపక్షం /మల్లాపూర్: మండలంలోని రాఘవపేట గ్రామంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా జాతర ఉత్సవాలు గత మూడు రోజుల నుండి ఘనంగా కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా శనివారం స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకి సేవలో ఘనంగా ఊరేగింపు నిర్వహించి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మండపంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మహోత్సవాన్ని వేద పండితుల వేద మంత్రాల సాక్షిగా కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. స్వామివారి కళ్యాణంలో ముఖ్య అతిథిగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సరోజన దంపతులు హాజరై కళ్యాణానికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి కళ్యాణం లో పాల్గొన్నారు. స్వామి వారి కళ్యాణం లో పాల్గొని తిలకించిన భక్తులకు హనుమాన్ దీక్ష స్వాములకు మహా అన్నదాన కార్యక్రమాన్ని జరిపించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాస్, ఉప సర్పంచ్ నరసయ్య,నాయకులు డీలర్ మల్లయ్య తోట సంతోష్ బైరి రవికుమార్, రాకేష్,వివిధ గ్రామాల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## లక్షెట్టిపేటలో దొంగ నోట్ల కలకలం

**ప్రజాపక్షం / లక్షెట్టిపేట :** లక్షెట్టిపేట పట్టణంలో గత 15 రోజులుగా రూ.500 దొంగ నోట్లు భారీగా చలామణి అవుతుండటంతో వ్యాపారులు, ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. దొంగ నోట్ల కేటుగాళ్లు సూపర్ మార్కెట్లు, మద్యం దుకాణాలు, అంగడిలను లక్ష్యంగా చేసుకుని ఈ నోట్లను చలామణి చేస్తున్నట్లు సమాచారం. రాత్రి సమయాల్లో మద్యం దుకాణాల్లో రద్దీని ఆసరాగా చేసుకుని దొంగ నోట్లు ఇచ్చి మద్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గత కొద్ది రోజులుగా ఈ సమస్య ఎదురవుతుండటంతో మద్యం దుకాణ యజమానులు, సిబ్బంది అప్రమత్తమై ప్రతి నోటును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం ఒక సూపర్ మార్కెట్‌లో దొంగ నోటు వచ్చినట్లు సమాచారం అందుకున్న లక్షెట్టిపేట పోలీసులు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఈ నోట్లు ఎక్కడి నుంచి వస్తున్నాయి, ఎవరెవరు చలామణి చేస్తున్నారు అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. దొంగ నోట్ల చలామణిపై పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరుతున్నారు.

## భవిష్యత్ తరాలకు సారవంతమైన నేల

మండల వ్యవసాయ అధికారి ప్రేమలత

**ప్రజాపక్షం / కౌటాల :** భవిష్యత్ తరాలకు సారవంతమైన సాగు నేలను అందించాలంటే రైతులు రసాయనాల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలని మండల వ్యవసాయ అధికారి ప్రేమలత సూచించారు. శుక్రవారం కౌటాల మండలం నాగేపల్లి గ్రామంలో సర్పంచ్ కపుడే బిక్కు పటేల్ అధ్యక్షతన రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు నేల సారం పెరుగుతుందని, పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని పేర్కొన్నారు. ఆహార ధాన్యాలు, కూరగాయల పంటల్లో కూడా ఈ విధానాన్ని సులభంగా ఆచరించవచ్చని, రసాయన అవశేషాలు లేని ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కార్తీక్, విస్తరణ అధికారి చి. అంజన్న, రైతులు పాల్గొన్నారు.

## మాలిలను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** తెలంగాణలోని మాలి కులస్తులను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు పార్లమెంటులో బిల్లు పాస్ అయ్యేలా చూడాలని మాలి సంక్షేమ సంఘం నాయకులు ఎంఎల్‌సి దండే విటల్‌ను కోరారు. శుక్రవారం కాగజ్ నగర్ పట్టణంలోని ఎంఎల్‌సి స్వగృహంలో ఆయనను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆర్థికంగా, సామాజికంగా, విద్యా ఉద్యోగ పరంగా చాలా వెనుకబడి ఉన్నారని ఈ సందర్భంగా వారు వివరించారు. రాష్ట్రంలోని ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపిలతో పార్లమెంటులో మాలి కులస్తుల అంశంపై ప్రస్తావన వచ్చేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ సామాజిక, ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని ఎస్‌టి జాబితాలో చేర్చాలని కోరారు.

## డ్రైవర్ల కంటి చూపు మెరుగుతోనే రోడ్డు భద్రత


జిల్లా ఎస్‌పి నితిక పంత్




**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్‌పి నితిక పంత్ తెలిపారు. శుక్రవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని ఎస్‌పిఎమ్ హెచ్‌ఆర్‌డి భవనంలో కాగజ్ నగర్ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో, కాగజ్ నగర్ మెడికల్ అసోసియేషన్ సౌజన్యంతో లారీ, ట్రక్ డ్రైవర్లు, క్లీనర్లకు ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్‌పి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు కంటి చూపు లోపాలు ప్రధాన కారణమని, వాటిని ముందుగానే గుర్తించి చికిత్స చేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా లారీ, ట్రక్ డ్రైవర్లు దీర్ఘ ప్రయాణాలు చేసే సమయంలో స్పష్టమైన చూపు అత్యంత అవసరమని చెప్పారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని, అధిక వేగాన్ని నివారించాలని హెచ్చరించారు. రాష్ డ్రైవింగ్, నిర్లక్ష్యపు డ్రైవింగ్, హెవీ లోడ్ డ్రైవింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డ్రైవింగ్ బాధ్యతను గుర్తించి తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి వాహనదారుడిపై ఉందన్నారు. శిబిరంలో పాల్గొన్న డ్రైవర్లు, క్లీనర్లు కంటి పరీక్షలు చేయించుకొని వైద్యుల సూచనలు పొందారు. ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్, మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, డాక్టర్ వెంకటేశ్వర్, సబ్ ఇన్స్పెక్టర్లు సుధాకర్, రాజు, ఏవిఎంఐ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడికి గురికావద్దు

జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్



**ప్రజాపక్షం / మందమర్రి :** బోర్డు పరీక్షలు రాసే విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. అనిత ఆదేశాల మేరకు శుక్రవారం మందమర్రి జిల్లా ప్రభుత్వ పాఠశాలలో మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటిష్టమైన మానసిక ఆరోగ్యానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సమతుల ఆహారం తీసుకుంటూ రోజుకు కనీసం 8 గంటల పాటు నిద్రపోవాలని తెలిపారు. కేవలం చదువుకే పరిమితం కాకుండా వ్యాయామానికి సమయం కేటాయించాలని, అప్పుడే శరీరం, మెదడు చురుకుగా పని చేస్తాయని వివరించారు. దురలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై ఏకాగ్రత పెంచుకోవాలని కోరారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ వాతావరణ మార్పులతో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స పొందాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ కాకిరాల వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయురాలు మాధవి, జయవంతరావు, ఆరోగ్య సిబ్బంది పద్మ, లలిత, సురేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రైవర్ల చూపు మెరుగైతేనే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి

పట్టణ సిఐ శ్రీనివాస రావు




**ప్రజాపక్షం / బెల్లంపల్లి :** డ్రైవర్లలో కంటి చూపు సమస్యలు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణంగా మారుతున్నాయని, చూపు మెరుగైతేనే ప్రమాదాలను నివారించవచ్చని బెల్లంపల్లి పట్టణ సిఐ శ్రీనివాస రావు అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా చేపట్టిన అరైవ్ అలైవ్ రెండో దశ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బెల్లంపల్లి పట్టణంలోని పద్మశాలి భవన్ లో డ్రైవర్ల కోసం ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. బెల్లంపల్లి టౌన్ పోలీసులు, శాంభవి ఆప్టికల్స్ సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో డ్రైవర్లకు సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించి, చూపు సమస్యలు ఉన్న వారికి ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రయాణికుల ప్రాణ భద్రత డ్రైవర్ల బాధ్యత అని గుర్తు చేశారు. ప్రతి డ్రైవర్ కాలానుగుణంగా కంటి పరీక్షలు చేయించుకోవాలని, చూపు మందగించడం వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ చట్టాలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. అధిక వేగం, లేన్ క్రమశిక్షణ పాటించకపోవడం, అలసటతో వాహనాలు నడపడం ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కట్ట రామ్ కుమార్, శాంభవి ఆప్టికల్స్ నిర్వాహకులు కె. అంజయ్య, ఆటో డ్రైవర్లు, ఆర్‌టిసి సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి అభివృద్ధిలో కార్మిక సంఘాల పాత్ర కీలకం

ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ

**ప్రజాపక్షం / మందమర్రి :** సింగరేణి సంస్థ అభివృద్ధి, ఉత్పత్తి లక్ష్యాల సాధనలో కార్మిక సంఘాల పాత్ర అత్యంత కీలకమని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ పేర్కొన్నారు. మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి ప్రతినిధులతో 15వ నిర్మాణాత్మక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గత సమావేశంలో ప్రస్తావించిన అంశాలపై జరిగిన పురోగతిని సమీక్షిస్తూ, కార్మికుల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్‌ఓటు జిఎం జివిల్ ప్రసాద్, ఏఐటియుసి బెల్లంపల్లి శాఖ కార్యదర్శి దాగం మల్లేష్, పర్సనల్ మేనేజర్ అశోక్, గ్రూపు ప్రతినిధులు రాంబాబు, ఖాదిర్, ఏరియా ఇంజినీర్ బాలాజీ భగవతి, కిరణ్ కుమార్, సురేష్, దూప్ సింగ్, సివిల్ ప్రధాన ఇంజినీర్ శ్రీధర్, క్వాలిటీ మేనేజర్ ప్రదీప్, సందీప్, సుదర్శనం, కంది శ్రీనివాస్, సివి రమణ పాల్గొన్నారు.

## భజరంగ్‌దళ్ నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాపక్షం/నిజాంసాగర్: నిజాంసాగర్ మండలంలోని గోర్గల్ గ్రామ శివారులో గల బేడీల మైశమ్మ ఆలయం వద్ద విశ్వహిందు పరిషత్, భజరంగ్‌దళ్ కమిటీ నూతన కార్యవర్గాన్ని విశ్వహిందు పరిషత్ కామారెడ్డి జిల్లా త్రిప్రఖండ సంఘటన మంత్రి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.హిందూ ధర్మంలో సంస్కృతులు, సాంప్రదాయాలు, హిందూ ధర్మ విలువలను కాపాడేందుకు హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు, హిందూ అమ్మాయిలను లవ్ జిహాద్ నుండి హిందువులను మతమార్పిడుల నుండి కాపాడేందుకు, గోమాతల అక్రమ రవాణా నిలిపివేసేందుకు, హైందవ ధర్మ పరిరక్షణకు విశ్వహిందు పరిషత్, భజరంగ్‌దళ్ ఎల్లప్పుడు పనిచేస్తుందన్నారు. బంజపల్లి మండల నూతన కమిటీ అధ్యక్షునిగా నారాయణ, ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి కుమార్, సహ కార్యదర్శి రాకేష్‌నాయక్, సత్సంగ్ ప్రముఖ్ లక్ష్మ ణ్‌దాస్, సహ ప్రముఖ్ రాకేష్, భజరంగ్‌దళ్ సంయోజక్ సందీప్‌కుమార్, సహ సంయోజక్ నవీన్‌గౌడ్, గోరక్ష ప్రముఖ్ యోగేశ్వర్, సహ ప రముఖ్ హరికృష్ణ, విద్యార్థి ప్రముఖ్ మహేష్, తదితరులు బాధ్యతలు స్వీకరించారు.

## ఫార్మర్ రిజిస్ట్రేషన్.. చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు

ఎడిఏ మనోహర్



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు పూర్తిగా లభిస్తాయని ఎడిఏ మనోహర్ అన్నారు. శుక్రవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలం విలేజ్ నంబర్ 12లో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. యూరియా బుకింగ్ యాప్, పంట నమోదు ప్రక్రియపై కూడా అవగాహన కల్పించారు. రైతులకు వర్తించే ప్రతి ప్రభుత్వ పథకానికి ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. వ్యవసాయ అధికారి రామకృష్ణ సబ్సిడీ పథకాల వివరాలు తెలియజేశారు. ఎలాంటి సందేహాలు ఉన్నా తమ వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రకాష్ సర్కార్, ఎఇఒ శ్రీనివాస్, దుర్గయ్య, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

## బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం / పెంచికల్ పేట్ :** పొదుపు అలవాటు ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రతను కల్పిస్తుందని, బ్యాంకింగ్ సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎలుకపల్లి శాఖ మేనేజర్ గోపి కిషోర్ సూచించారు. శుక్రవారం పెంచికల్ పేట్ మండలంలోని బొంబాయిగూడ గ్రామంలో బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీలు, ప్రభుత్వ పథకాల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని, తీసుకున్న రుణాలను సమయానికి చెల్లించాలని పేర్కొన్నారు. మోసపూరిత కాల్స్, ఫేక్ మెసేజ్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ బీమా, పెన్షన్ పథకాలైన ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలలో అర్హులు నమోదు చేసుకోవాలని సూచించారు. సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు రాజబాబు, శేఖర్, మల్లేష్ గ్రామస్తులకు డిజిటల్ పేమెంట్స్, సేవింగ్స్ ఖాతాల ప్రయోజనాలు, ఆర్థిక ప్రణాళిక అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు మహేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

ముధోల్‌లో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య పరీక్షలు..

**ప్రజాపక్షం/ముధోల్ :** రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించడమే ధ్యేయంగా నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ''అరైవ్ అలైవ్2026'' కార్యక్రమం రెండో దశ జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోంది.ఇందులో భాగంగా శుక్రవారం ముధోల్ పట్టణంలో డ్రైవర్ల కోసం ఏర్పాటు చేసిన మెగా ఉచిత కంటివ వైద్య పరీక్ష శిబిరాన్ని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ ప్రారంభించారు.స్థానిక ఆసుపత్రి వైద్యుల సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలోఅ డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి,చూపు సమస్యలు ఉన్నవారిని గుర్తించి వారికి ఎస్పీ చేతుల మీదుగా ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ,వాహన చోదకులకు దూరదృష్టి లోపం లేదా చూపు మందగించడం వంటి సమస్యలు ఉండటం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.డ్రైవర్లకు సరైన కంటి చూపు ఉండటం అనేది వారి భద్రతకే కాకుండా ప్రయాణికుల భద్రతకు కూడా అత్యంత అవసరమని,అందుకే డ్రైవర్లు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.రోడ్డు భద్రతా నియమాలను పాటించడంతో పాటు 'డిఫెన్సివ్ డ్రైవింగ్'పద్ధతులను అలవర్చుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఆమె స్పష్టం చేశారు.బైంసా ఏఎస్పీ రాజేష్ మీనా,ముధోల్ ఇన్స్పెక్టర్లు రవీందర్,సమ్మయ్య,స్థానిక ఎస్సైలు,పోలీస్ సిబ్బందితో పాటు భారీ సంఖ్యలో డ్రైవర్లు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.ప్రజల ప్రాణాలకు రక్షించడంలో భాగంగా నిర్వహిస్తున్న ఇటువంటి సామాజిక బాధ్యతాయుత కార్యక్రమాలపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పసుపు కొనుగోళ్లపై రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** పసుపు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు అత్యంత బాధాకరమని మార్కెట్ యార్డులో పసుపు కొనుగోలు ప్రక్రియలో ఈ నామ్‌లో ఏర్పడిన సాంకేతిక లోపాలతో పసుపు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వెలిబుచ్చారు. ఇప్పటికే పాత ఈనామ్ విధానంలో అనేక సమస్యలున్నప్పటికీ సరైన శిక్షణ లేకుండా, సాంకేతిక సదుపాయాలు సిద్ధం చేయకుండా కొత్త ఈనామ్ విధానాన్ని అమలు చేయటంతో ఏర్పడిన సాంకేతిక లోపాలతో పసుపు కొనుగోళ్ల విషయంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డుకు పసుపు పంట గణనీయంగా వచ్చినా, ప్రభుత్వాలు ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేక కొనుగోలు సక్రమంగా చేయటంలో విఫలమయ్యాయి. ఫలితంగా రైతులు ప్రతిసారి పంటను అమ్ముకోవడానికి మూడు నాలుగు రోజులు పడిగాపులు కాసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పసుపు పంటతో జిల్లా దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపున్న నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు కలిగేలా ప్రభుత్వాలు వ్యవహరించడం అన్యాయమన్నారు. దళారులు సిండికేట్ అయి పసుపు రైతులకు నష్టం కలిగిస్తే సహించేది లేదని, పసుపు రైతులకు నష్టం జరిగితే ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు.

# యాంత్రీకరణ పథకం ద్వారా వ్యవసాయ రైతులకు లబ్ధి

ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్



**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలోని ఎస్ఎస్ ఫ్యాక్టరీలో (ఎస్.యం.ఏ.యం)వ్యవసాయ యాంత్రికరణ పథకం ద్వారా రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆధునిక వ్యవసాయ పనిముట్లను 50 శాతం సబ్సిడీతో లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మిర్జాపూర్ గ్రామానికి చెందిన పంచగూడి రాణి,గజ్జి గంగామణి,వాలేగాం గ్రామానికి చెందిన జ్యోతి,వానల్ పాడ్ గ్రామానికి చెందిన శకుంతల బాయి లకు రోటవేటర్లు అందజేయగా,కోతల్ గావ్ కు చెందిన సాయినాథ్ రావుకు పవర్ వీడర్‌ను అందించారు.అదేవిధంగా స్ప్రే పంపులు,రోటవేటర్లు తదితర ఆధునిక వ్యవసాయ పరికరాలను రైతులకు పంపిణీ చేశారు.ఈ పంపిణీ కార్యక్రమం గ్రామీణ వ్యవసాయ రంగానికి ఊతమిచ్చే చర్యగా భావిస్తున్నారు.పెరుగుతున్న సాగు ఖర్చులు,కార్మికుల కొరత వంటి సమస్యల నేపథ్యంలో స్ప్రే పంపులు,రోటవేటర్ల వంటి పరికరాలు రైతులకు సమయంతో పాటు ఖర్చు తగ్గింపులో సహాయపడే అవకాశముందని అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ తరహా పథకాలు సక్రమంగా అమలు అయితే చిన్న,మధ్య తరహా రైతుల ఉత్పాదకత పెరగడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావచ్చన్నారు.పరికరాల పంపిణీతో పాటు వాటి వినియోగంపై శిక్షణ,సాంకేతిక సహాయం కూడా అందిస్తే రైతులకు మరింత ప్రయోజనం చూకూరుతుందని సూచించారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు,రైతులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పాఠశాలకు అదనపు గదుల నిర్మాణం కోసం రూ. లక్ష విరాళం



**ప్రజాపక్షం/బైంసా :** శ్రీ సరస్వతీ శిశు మందిరాల పూర్వ వైభవం కోసం పూనుకున్న దాత విరాళం శిశు మందిరాల అభివృద్ధికి కృషికి పాఠశాల అదనపు గదుల నిర్మాణం నిమిత్తం కి,శే,శ్రీ ఏనుగు రాజారెడ్డి ఏనుగు వెంకటలక్ష్మి కుమారుడు ఏనుగు గంగారెడ్డి వినాయక్ నగర్ బైంసా (నిర్మల్ జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు) జిల్లా కార్యదర్శి పురస్తు గోపాల్ కిషన్ శ్రీ సరస్వతీ మందిర్ గుజిరిగల్లి బైంసా పాఠశాలకు అదనపు గదుల నిర్మాణం కోసం ఒక లక్ష రూపాయలు విరాళం అందించారు.శిశు మందిరాలు సంస్కృతీ,సాంప్రదాయాలు,చదువుతో పాటు విద్యార్థులకు చిన్న నాటి నుండి సంస్కారాలతో ముందుకు తీసుకు వెళుతున్నాయని ప్రశంసించారు.సమాజ నిర్మితం కోసం,వ్యక్తినిర్మాణ కార్యంలో జాతిపరమ వైభవ స్థితికి మూల స్తంభాలైన శిశు మందిరాలను భావితరాలకు మొదటి నుండి సహాయ సహకారం అందించడమే ఆనంద దాయకమని ఆయన ప్రకటించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు డి.శ్రీధర్ పాఠశాల సహకార్యదర్శి తోటరాము పాఠశాల ప్రధానాచార్యులు రాముల గంగాధర్ పాల్గొన్నారు.

# మంజ్రి గ్రామ పాఠశాలలో విగ్రహ ప్రతిష్ఠాపన

**ప్రజాపక్షం/బైంసా :** బైంసా మండలంలోని మంజ్రి గ్రామ పాఠశాలలో శ్రీ సరస్వతి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.విద్యకు అధ్యదేవత అయిన సరస్వతి దేవి ఆశీస్సులతో విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.అలాగే గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాల పెంపు కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని,ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా కృషి కొనసాగుతుందని తెలిపారు.ప్రజల ఆశీర్వాదంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,గ్రామ పెద్దలు,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రికవరీ మొబైల్ ఫోన్ల బాధితులకు అందజేసిన ఎస్‌పి..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** మొబైల్ దొంగతనాలు,పోగొట్టుకున్న ఫోన్ల రికవరీలో నిర్మల్ జిల్లా పోలీసులు మరోసారి తమ సత్తా చాటారు.జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ ఆదేశాల మేరకు సాంకేతికతను జోడించి నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా రికవరీ చేసిన 82 మొబైల్ ఫోన్లను (విలువ రూ.9.84 లక్షలు)శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బాధితులకు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 2,006 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించామని,వీటి మొత్తం విలువ సుమారు రూ.2,40,72,000 ఉంటుందని వెల్లడించారు.మొబైల్ ఫోన్ పోయినా లేదా చోరీకి గురైనా ఆందోళన చెందకుండా వెంటనే () వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని ఆమె సూచించారు.ఈ పోర్టల్ ద్వారా ఫోన్లను ట్రాక్ చేయడం,బ్లాక్ చేయడం సులభమవుతుందని,తద్వారా వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం కాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు.సెకండ్ హ్యాండ్ మొబైల్స్ కొనుగోలు చేసే విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ హెచ్చరించారు.తక్కువ ధరకు వస్తున్నాయని అపరిచితుల వద్ద ఫోన్లు కొని ఇబ్బందుల్లో పడవద్దని,అవి చోరీ సొత్తు కాదో సరిచూసుకోవాలని కోరారు.అలాగే,ఒకే వ్యక్తి వద్ద పెద్ద సంఖ్యలో ఫోన్లు కనిపిస్తే అది ఏదైనా అంతర్రాష్ట్ర దొంగల ముఠా పని కావచ్చని,అటువంటి వారిపై నిఘా ఉంచి సమగ్ర విచారణ జరపాలని పోలీసు అధికారులను ఆదేశించారు.సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్లను రికవరీ చేయడంలో చురుగ్గా వ్యవహరించిన ఐటీ కోర్ సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.

# సైన్స్ ల్యాబ్,సిబ్బంది నివాస గృహాలకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/నేరడిగొండ :** నేరడిగొండ మండలంలోని లఖంపూర్‌లో గల ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో సైన్స్ ల్యాబ్,సిబ్బంది నివాస గృహాల నిర్మాణానికి శుక్రవారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్,బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్,ల చేతుల మీదుగా భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.80 లక్షలతో సిబ్బంది నివాస గృహాలు,సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి రూ.21 లక్షల వ్యయంతో నిర్మించడం జరుగుతుందని విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,గ్రామ సర్పంచ్ షెడ్మాకి సుజాత గంగాధర్,వివిధ గ్రామాల సర్పంచులు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ నీటి సరఫరా కేంద్రాన్ని పరిశీలన

నిమ్మల ప్రవీణ్



**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలో గల మిషన్ భగీరథ నీటి సరఫరా కేంద్రాన్ని శుక్రవారం మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి 14వ వార్డు కౌన్సిలర్ నిమ్మల ప్రవీణ్ సందర్శించారు.గత రెండు రోజుల నుండి మిషన్ భగీరథ మంచినీరు పసుపు రంగులో వస్తున్నాయని పట్టణ ప్రజల ఫిర్యాదు మేరకు,నేడు మిషన్ భగీరథ బైంసా ఏఈ శ్రీమన్ దృష్టికి చైర్మన్ తీసుకువెళ్లారు.సానుకూలంగా స్పందించినటువంటి మిషన్ భగీరథ అధికారులు ఇలాంటి పసుపు రంగునీరు రాకుండా,సంబంధిత కెమికల్స్ వాడి,మంచి నీరు వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# పదో తరగతి విద్యార్థుల్లో 'ప్రేరణ' నింపిన ఆనందిత ఫౌండేషన్

**ప్రజాపక్షం/బైంసా :** పదో తరగతి విద్యార్థులు పరీక్షల పట్ల భయాన్ని వీడి,ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని చేరుకోవాలని ఎంఈఓ ఎ.సుభాష్ పిలుపునిచ్చారు.శుక్రవారం సూరలోకి గార్డెన్‌లో ఆనందిత ఫౌండేషన్,విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన''పరీక్షల సంసిద్ధత,ప్రేరణ తరగతులు'' సదస్సుకు వెయ్యి మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు.ఈ సందర్భంగా మానసిక వైద్య నిపుణులు డాక్టర్ సురేష్ అల్లాడి ఒత్తిడిని జయించే మార్గాలను వివరించగా,ఫౌండేషన్ చైర్మన్ వాడేకర్ లక్ష్మణ్ విద్యార్థులకు లక్ష్య సాధనపై దిశానిర్దేశం చేశారు.సబ్జెక్టు నిపుణులు పరీక్షల్లో సమయ పాలన,రివిజన్ పద్ధతులపై మెళకువలు నేర్పారు.ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించిన ఆనందిత ఫౌండేషన్ ను పలువురు అభినందించారు.

# అకాల వర్షాలతో పంట నష్టం

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలు,వడగండ్ల వానల వల్ల దెబ్బతిన్న పంటల నష్టాన్ని శాస్త్రీయంగా అంచనా వేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు.క్షేత్రస్థాయిలో జరిగిన ప్రాథమిక అంచనాల ప్రకారం,జిల్లా వ్యాప్తంగా సుమారు 5,000 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు.ముఖ్యంగా మక్కజొన్న పంట తీవ్రంగా దెబ్బతిన్నట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.ఈ నేపథ్యంలో,ప్రతి పంట పొలాన్ని వ్యక్తిగతంగా సందర్శించి,జరిగిన నష్టంపై సమగ్ర నివేదికను యుద్ధప్రతిపాదికన సిద్ధం చేయాలని ఆమె సూచించారు.

## అశోక్ సాగర్‌లో కాలుజారి పడి వ్యక్తి మృతి



ప్రజాపక్షం/ఎడపల్లి: నిజామాబాద్ మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన ఈమడే మస్నాజీధ (45) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు అశోక్ సాగర్‌లో పడి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎడపల్లి ఎస్సై రమ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మస్నాజీ శుక్రవారం ఉదయం పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయలుదేరాడు. మధ్యాహ్నం సమయంలో భార్య అంజన్ బాయి తన భర్తకు ఫోన్ చేయగా, గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ ఎత్తాడు. జాన్కంపేట్ గ్రామ శివారులోని అశోక్ సాగర్ ఒడ్డున ఒక బైక్, ఫోన్ పడి ఉన్నాయని సదరు వ్యక్తి సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అశోక్ సాగర్ వద్దకు చేరుకొని గాలించగా, మస్నాజీ మృతదేహం నీటిలో తేలుతూ కనిపించింది. కాలకృత్యాలు తీర్చుకోవడానికి చెరువు ఒడ్డుకు వెళ్లిన క్రమంలో, ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయి ఉంటారని, ఈత రాకపోవడంతో మునిగి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి భార్య అంజన్ బాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై రమ తెలిపారు.

## కలెక్టర్‌ను కలిసిన పీఎంశ్రీ నోడల్ అధికారి

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను పీఎంశ్రీ నోడల్ అధికారి ప్రవీర్ కుమార్ శుక్రవారం కలిసారు. పీఎం శ్రీ కింద జిల్లాలోని పలు విద్యాలయాల్లో అమలు అవుతున్న కార్యక్రమాలను పీఎంశ్రీ నోడల్ అధికారి, కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్, అర్బన్ ఎఫైర్స్ జాయింట్ సెక్రటరీ ప్రవీర్ కుమార్ పరిశీలించేందుకు వచ్చి.. కలెక్టర్ ను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మర్యాద పూర్వకంగా కలువగా, పుష్ప గుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా పీఎంశ్రీ కింద అమలు చేస్తున్న కార్యక్రమాలు, వివిధ నిర్మాణ పనులపై చర్చించారు.

## పీఎంశ్రీ కార్యక్రమాల అమలు పరిశీలన

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : పీఎం శ్రీ కింద జిల్లాలోని పలు విద్యాలయాల్లో అమలు అవుతున్న కార్యక్రమాలను పీఎంశ్రీ నోడల్ అధికారి, కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్, అర్బన్ ఎఫైర్స్ జాయింట్ సెక్రటరీ ప్రవీర్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తంగళ్లపల్లి మండలం మండేపల్లిలోని మోడల్ స్కూల్, కేంద్రీయ విద్యాలయాలను సందర్శించారు. పీఎంశ్రీ కింద జిల్లాలోని ఆయా స్కూల్ లలో చేపట్టిన పనులను త్వరితగతిన పనులను పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులను పాఠ్యాంశాలతో పాటుగా అన్ని రంగాల్లో ఉత్తమ ప్రతిభ చూపెట్టే విధంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రదర్శనలు, ఇతర కార్యక్రమాలను అభినందించారు. అన్ని విద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని, విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో రాణించేలా ప్రోత్సాహం అందించాలని సూచించారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో పీఎంశ్రీ అమలు పై సమీక్షించారు.సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, పాఠశాల విద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనార్దన్ రావు, సమగ్ర శిక్ష రాష్ట్ర కోఆర్డినేటర్ విక్రమ్ రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ దబ్బెడ హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

## అడవిని అమ్ముకుంటున్న రవీందర్‌ను సస్పెండ్ చేయాలి

ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ : ఖానాపూర్ మండలంలోని తర్లపాడు గ్రామ పరిధిలో అటవీ సంపద యధేచ్ఛగా కొల్లగొట్టబడుతున్న అటవీ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం పై సీపీఎం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ముఖ్యంగా ఎఫ్.ఎస్.ఓ రవీందర్ అటవీ స్మగ్లర్లతో చేతులు కలిపి విలువైన చెట్లను అమ్ముకుంటున్నారని,తర్లపాడు గ్రామ సమీపంలోని చెరువు పక్కన ఉన్న పెద్ద చెట్లతో పాటు,పాత తర్లపాడులోని కొంకుడాల కుంట,బత్తుల సింగరి ఆల్వా ప్రాంతాల్లో సుమారు 20 నుండి 30 చెట్లను స్మగ్లర్లు మిషన్లతో నరికి తరలించారని వారు ఆరోపించారు.ఇంత భారీ స్థాయిలో అటవీ సంపద తరలిపోతున్నా సదరు అధికారి కనీస చర్యలు తీసుకోకపోవడం వెనుక పెద్ద ఎత్తున దందా సాగుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దురం నూతన కుమార్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి,సీపీఎం మండల కార్యదర్శి నాగెల్లి నర్సయ్య ధ్వజమెత్తారు.మరోవైపు,అడవిని కాపాడాల్సిన అధికారి అదనపు ఆదాయం కోసం స్మగ్లర్లను పెంచి పోషిస్తూ,అమాయక పోడు రైతులపై మాత్రం కక్షగట్టి వేధిస్తున్నారని వారు మండిపడ్డారు.తర్లపాడుకు చెందిన రైతు బోసు భూమన్న



గత 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూమిని బలవంతంగా లాక్కోవడానికి ప్రయత్నిస్తూ,పొలంలో సీసీ కెమెరాలు పెట్టి నిఘా ఉంచడం,పీడీ యాక్ట్ కింద జైలుకు పంపుతామని బెదిరించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.సాగులో ఉన్న భూములను గుంజుకుంటూ రైతుల పొట్ట కొడుతున్న ఈ అధికారి తీరును ప్రజలు గమనించాలని కోరారు.వెంటనే విజిలెన్స్ అధికారులు అడవిని సందర్శించి విచారణ జరిపాలని,అక్రమాలకు పాల్పడుతున్న ఎఫ్.ఎస్.ఓ రవీందర్ ను సస్పెండ్ చేసి కేసులు నమోదు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ అక్రమాలపై ఉన్నతాధికారులకు త్వరలోనే పూర్తి నివేదిక అందజేస్తామని నాయకులు స్పష్టం చేశారు.

## పిఎంశ్రీ అమలు, సౌకర్యాలపై కేంద్రీయ విద్యాలయ నిజామాబాద్‌లో పరిశీలన

ప్రజాపక్షం/నిజామాబాద్ : కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపడుతున్న పిఎం పథకం అమలు సౌకర్యాలపై పరిశీలన నిమిత్తం కేంద్ర జాయింట్ సెక్రటరీ దేవేంద్రకుమార్ కేంద్రీయ విద్యాలయ నిజామాబాద్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలు చేస్తున్న స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, డిజిటల్ ల్యాబ్‌లు, సైన్స్ , కంప్యూటర్ ల్యాబ్ సదుపాయాలు, శుద్ధి చేసిన తాగునీరు, పరిశుభ్రమైన శౌచాలయాలు, క్రీడా వసతులు వంటి మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల గణిత, విజ్ఞాన ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. అలాగే పాఠశాలప్రాంగణంలో చేపడుతున్న మొక్కల నాటడం కార్యక్రమం, పర్యావరణ చర్యలు, విద్యార్థులు స్వయంగా చేపడుతున్న సేంద్రీయ వ్యవసాయ కార్యక్రమాలు ఆయనను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ప్రకృతి పట్ల చూపుతున్న ఆసక్తి సేంద్రీయ వ్యవసాయంతో పర్యావ



రణ అవగాహన పెంపొందించటంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు పిఎంశ్రీ పథకంతో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఈ పథకం మరింత తోడ్పడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ, రాష్ట్ర విద్యాధికారులు విజయలక్ష్మీ బాయి, శ్రీనాథ్, డీఈఓ అశోక్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## యూరియా కొరతపై రైతుల ఆందోళన

ప్రజాపక్షం/ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్‌లో యూరియా కొరతపై రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సొసైటీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ ఎరువుల గిడ్డంగికి తాళం వేశారు. ప్రస్తుతం సాగు పనులు ముమ్మరంగా కొనసాగుతున్న నేపథ్యంలో అనుకున్నంతగా యూరియా అందకపోవడం వల్ల పంటలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రారంభమైన ఆన్‌లైన్ బుకింగ్ విధానంపై కూడా రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బుకింగ్ చేసినప్పటికీ సరైన సమయంలో ఎరువులు అందడం లేదని, సాంకేతిక సమస్యల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. చిన్న, మధ్య తరహా రైతులు ఎక్కువగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. యూరియా సరఫరా నిలకడగా లేకపోవడంతో పంటల దిగుబడిపై ప్రభావం పడే అవ



కాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సరిపడా ఎరువులు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. సంబంధిత మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధిరామేశ్వర్ అక్కడికి చేరుకొని రైతులను సముదాయించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

## పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

### సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాపక్షం/గొల్లపల్లి : గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కోమటి చంద్రశేఖర్ అన్నారు .శుక్రవారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం కేంద్రంలోని బస్టాండ్ నుండి మండల పరిషత్ కార్యాలయం వరకు తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు)మండల కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించి జూనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ కు వినతి పత్రం ఇచ్చారు .ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామ పంచాయితీ సిబ్బంది అందరిని 2వ పిఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని, గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు.ఆన్ లైన్లో నమోదు కాని కార్మికుల పేర్లను నమోదు చేసి అందరికీ వేతనాలు చెల్లించాలని కోరారు.అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా జీఓ నెం.51 సవరణ చేసి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని తెలిపారు.పాత కేటగిరి లన్నింటిని కొనసాగించాలని పేర్కొన్నారు.కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయక కార్యదర్శులుగా నియమించాలన్నారు.అర్హులైన సిబ్బందికి ప్రమోషన్లను కల్పించాలన్నారు.నూతనంగా ఎన్నికైన సర్పంచుల వేధింపులు కార్మికుల తొలగింపుల పైన చర్యలు చేపట్టాలని 2 నెలల బకాయి వేతనాలు తక్షణమే విడుదల చేయాలని అన్నారు. ఇన్సూరెన్స్ ,ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో 12,790 గ్రామ పంచాయితీల్లో సుమారు 60,000 మంది గ్రామ పంచాయితీ ఉద్యోగులు, కార్మికులు పని చేస్తున్నారు. గ్రామాలను పారిశుభ్రంగా తీర్చిదిద్దుతూ గ్రామీణ ప్రాంతాలలో ఎలాంటి అంటువ్యాధులు, అనారోగ్యాలు రాకుండా ప్రజల ఆరోగ్యాలను కాపాడుతు పంచాయతీ కార్మికులు సేవలందిస్తున్నారు. అటువంటి పారిశుధ్య కార్మికులకు పని భద్రత లేదు ఎలాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని అన్నారు.

## కోనాపూర్‌లో సైన్స్‌మేళా

ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి : మండలంలోని కోనాపూర్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారిచే పాఠశాలకు అందజేయబడిన సైన్స్ కిట్ పరికరాలు తయారుచేసిన శుక్రవారం సైన్స్ ఉపకరణాల ప్రదర్శించారు. 610 వ తరగతుల జీవ శాస్త్రం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం సబ్జెక్టుల్లో 100 ప్రయోగాలను విద్యార్థులు తయారుచేశారు. మానవ అస్థి పంజరం, నమూనా పుర్రె నమూనా, లెజర్‌లైట్, ఆహారపు గొలుసు, వివిధ రకాల జంతువుల చిత్రాలు, బ్యాటరీ, కాంతి అనువర్తనాలు మొదలైనవి ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్, సైన్స్ ఉపాధ్యాయులు రామకృష్ణ, భాస్కర్, రాజారాజేశ్వరి పాల్గొన్నారు.

## కంటి శిబిరానికి స్పందన

ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి : మండలంలోని బషీరాబాద్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కంటి వైద్యశిబిరానికి స్పందన లభించిందన్నారు. జిల్లా కంటి ఆస్పత్రి సూపర్ స్పెషలిస్ట్ కంటి వైద్యులు టి.శ్రీనివాస్ 95 మందికి కంటి పరీక్షలు చేయగా 17 మందికి కంటి ఆపరేషన్లు అవసరంగా గుర్తించామన్నారు. సర్పంచ్ బైకని జమున మహేష్, ఉపసర్పంచ్ చిలివేరి భూమేష్ మాట్లాడుతూ కంటి సమస్యలుంటే ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించి చూపించుకోవాలన్నారు. జ్ఞానేంద్రియాలలో కళ్లు ముఖ్యమైనవన్నారు. కంటి చూపు తక్కువగా ఉన్న వారు అద్దాలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రమేష్, రాజు, శ్రీనివాస్, శివానంద్, తిరుపతి, మహేష్, శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు

ప్రజాపక్షం/బాల్కొండ: ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు విశ్వతేజాస్ ఫౌండర్ తిరునగిరి శ్రీహరిచే లైఫ్ కోచ విద్యార్థులుఅవసరమైన నిపుణత వ్యక్తిత్వ వికాసం, యంగ్ మైండ్స్ కౌన్సిలింగ్, విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన తరగతులు, మోటివేషనల్ సెషన్స్ నిర్వహించారు. కార్యక్రమం అధ్యాంతం అత్యంత ఉత్సాహంగా కొనసాగింది. విద్యార్థులలో ఎంతో ప్రేరణను నింపిందని ఎంఈఓ రాజేశ్వర్ తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులు వ్యక్తిత్వ వికాస నిపుణులు శ్రీహరి కి కృతజ్ఞతలు తెలిపారు. జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థుల మానసిక, వ్యక్తిత్వ వికాస పరిణితి కోసం విద్యార్థులకు తరగతులు నిర్వహించామన్నారు. సమాజంలో మారుతున్న పోకడలకు, విద్యావ్యవస్థలో అనునిత్యం జరుగుతున్న మార్పులకు పిల్లల్లో చోటు చేసుకుంటున్న టెక్నాలజీ వ్యసనం లాంటి విశ్వతేజాస ఫౌండర్ ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు శ్రీహరి విజన్ టువిక్టరీ అనే అంశంపై మాట్లాడారు.తమ తల్లిదండ్రులు తమ కోసం పడుతున్న కష్టాలను గుర్తెరిగి తాము కూడా ఉన్నత స్థాయికి ఎదుగుతామని ప్రతిజ్ఞ చేశారు. పదవ తరగతి విద్యార్థులు భవిష్యత్తులో తమ తల్లిదండ్రులు కలలు గన్న కలలను నెరవేరుస్తామన్నారు. అనంతరంప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఘనంగా శాలువ, జ్ఞాపికతో సన్మానించామన్నారు. ప్రశాంత్‌కుమార్, ఉపాధ్యాయులు,పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాలభివృద్ధికి అందరం కలిసి నడుద్దాం : మోహన్‌రెడ్డి

ప్రజాపక్షం/భీమ్‌గల్ : బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలం రహత్‌నగర్ గ్రామంలో బంజారా ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి సందర్భంగా భోగ్‌బండార్‌లో భాగంగా రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి సేవాలాల్ ఆ జన్మ బ్రాహ్మచారిగా ఉండి లంబాడీల అభివృద్ధి కోసం సుమారు 500 తండాలను తిరుగుతూ తండాలోని గిరిజన సోదరులను అభివృద్ధి కృషి చేశారన్నారు. సేవాలాల్ చేసిన కృషికి ఒకరోజు కాదు వారం రోజుల పాటు పార్టీలకతీతంగా జరుపుకోవాలన్నారు. త్వరలోనే కొత్త పింఛన్లు ప్రారంభించి 4 వేలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతి, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, మున్సిపల్ చైర్మన్ స్వామి, వేల్పూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నర్సారెడ్డి, బంజారా జిల్లా అధ్యక్షులు చంద్రునాయక్, డీటీడబ్ల్యూఓ రామారావు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థిని తృతీయస్థానం

ప్రజాపక్షం /ముస్తాబాద్ : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్, రాజన్న సిరిసిల్ల ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ లో ముస్తాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకి చెంది 8వ తరగతి విద్యార్థిని రాగం స్వాతి మండల స్థాయిలో తృతీయ స్థానం సాధించి జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ లో పాల్గొని ప్రశంసా పత్రం పొందినదని పాఠశాల ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఎల్లారెడ్డి, రాజా మహమ్మద్ జింగిటి ఆనందం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మ రాజిరెడ్డి ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## ఢిల్లీ సత్యగ్రహ దీక్షలో అంజిని

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ఢిల్లీలో జరిగిన సత్యగ్రహదీక్ష లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజిని పాల్గొన్నారు. ఏఐ సమ్మిట్ సందర్భంగా యువజన కాంగ్రెస్ ను దేశ వ్యాప్తంగా దోషిగా చిత్రకరించే ప్రయత్నంలో అక్రమ అరెస్టులు చేయటాన్ని నిరసిస్తూ ఢిల్లీలో చేపట్టిన సత్యగ్రహ దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అంజిని మాట్లాడారు. జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ ను అక్రమంగా అరెస్ట్ చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. ఢిల్లీ లో గత నాలుగు రోజులుగా దీక్ష లు చేపట్టినట్లు తెలిపారు. దశల వారీగా రాష్ట్రంలో కూడ ఆందోళన లు చేపడతామని పేర్కొన్నారు.

## కరెంటు షాక్‌తో మృతి

**ప్రజాపక్షం/రేగోడు:** మెదక్ జిల్లా రేగోడు మండల కేంద్రంలోని గజవాడ గ్రామంలో కుమ్మరి సంగయ్య 65 సంవత్సరాలు కరెంటు షాక్ తగలడంతో మృతి చెందాడు. ఎస్ఐ పోచయ్య కథన ప్రకారం సంగయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవి చేవాడు ఉద యం 7గంటల సమయంలో తన ఇంటి ముందు రేకుల షెడ్యూలో తన బట్టల బ్రష్‌ను తీసుకుంటుండగా ప్రమాదశాతం కరెంటు షాక్ తగలడంతో కింద పడడంతో వెనుక భాగంలో బలమైన దెబ్బ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు భార్య ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పోచయ్య తెలిపారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**ప్రజాపక్షం/నిజాంపేట్:** విద్యార్థి దశలో ఉపాధ్యాయులుగా వ్యవహరించడం తీపి జ్ఞాపకమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ అన్నారు. నిజాంపేట మండలం నస్కల్ గ్రామంలో గురువారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ గా రాములు, ఎంఈఓ గా లతిక, హెచ్ఎం గా శ్రీవాణి వ్యవహరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థి దశలో ఉపాధ్యాయులు గా వ్యవహరించి ఉపాధ్యాయ వృత్తిపై అవగాహన కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నేడు సీజ్ చేసిన ఇసుక వేలం

**ప్రజాపక్షం/రామాయంపేట:** అక్రమంగా డంపు చేసిన ఇసుకను స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు శనివారం వేలం వేయనున్నారు. గత సంవత్సరం డిసెంబర్ 31న మండలంలోని ఝాన్సీ లింగాపూర్ శివారులో అక్రమంగా ఇసుక డంపు చేశారన్న సమాచారంతో అధికారులు అక్కడికి చేరుకొని 16 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసి రామాయంపేట తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. అట్టి ఇసుకను మైనింగ్ అధికారుల ఆదేశాల మేరకు శనివారం వేలం వేయడం జరుగుతుందని ఆసక్తిగల వారు వేలం పాల్గొనాలని తహశీల్దార్ రజనికుమారి కోరారు.

**పట్టణంలో అక్రమ డంపుల పరిస్థితి ఏమిటి..?**

సీజ్ చేసిన ఇసుక డంపులను వేలం వేయనున్నట్లు ప్రకటన జారీ చేయడంతో మరోసారి రామాయంపేటలో అక్రమ ఇసుక వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన ఇసుకను స్వాధీనం చేసుకున్నామని అధికారులు చెబుతున్నప్పటికి పట్టణ పరిధిలో బారీగా ఇసుక డంపులు కనిపిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తుంది. కొందరు వ్యక్తులు రాత్రి వేళ అక్రమంగా ఇసుకను దిగుమతి చేసుకొని పగటిపూట బహిరంగంగానే అధిక ధరలకు విక్రయాలు జరుపుతున్నా అధికారులకు కనిపించడంలేదా అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ ఇసుక డంపులపై పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు మాత్రమే అధికారులు స్పందించి నామ మాత్రపు ఫైన్‌తో వదిలిపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అప్పుడు కూడా కొద్దిపాటి డంపులను సీజ్ చేసి మిగిలిన వాటిని పట్టించుకోకపోవడం వెనుక కారణాలేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ ఇసుక డంపులపై అధికారులు పూర్తి స్థాయి సర్వే నిర్వహించి అనుమతులు లేని డంపులను సీజ్ చేయాలని అక్రమాలకు పాల్పడేవారిని ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సైతం అధికారులకు ఆదేశాలు జారీ చేసిన సంగతి విదితమే.

# సత్ప్రవర్తనే విజయానికి తొలిమెట్టు

### మెదక్ జిల్లా విద్యాధికారి విజయ




**ప్రజాపక్షం/వెల్దుర్తి:** మెదక్ జిల్లా వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి 10వ తరగతి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి మెదక్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయ మాట్లాడుతూ, ఇక్కడ నేర్చుకున్న విద్య, మీరు పొందిన అనుభవం మీ భవిష్యత్తుకు మంచి మార్గదర్శకాలు, మీరు మీ కలలను సాకారం చేసుకోవడానికి, మీరు ఎన్నో విజయాలు సాధించడానికి మీ పాఠశాల మీకు అండగా ఉంటుందని ఆమె అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థులైన మీరు పాఠశాలకు తెచ్చిన ప్రగతి, మీరు చూపిన క్రమశిక్షణ, మీరు సాధించిన విజయాలు మా అందరికి గుర్తుండిపోతాయి. మీరు మన పాఠశాలకు అందించిన గౌరవం, మీరు చూపిన ప్రతిభ భావితరాలకు ఆదర్శం కావాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల జిల్లా యువజన మరియు క్రీడల అధికారి గంగాల రమేష్, గ్రామ సర్పంచ్ ఆదర్శ్, ఉప సర్పంచ్ శ్రవణ్ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మాధురి, అలాగే పాఠశాల ఉపాధ్యాయులు వెంకటస్వామి, శ్రీనివాస్, నరసింహారెడ్డి, ఖదీర్, అమూల్య, అర్చన, విజయ్ మోహన్, జయసుధ, శైలజ, నవనీత, రాము, చార్లెస్, పద్మజ, సునీత, వాణిశ్రీ, వెంకట్ రెడ్డి, ధనరాజ్, రేణుక, రాధిక, సిఆర్పి రాజు, పిటిఐ యాదగిరి, నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/పాపన్నపేట:** పోలీసులకు పిర్యాదు చేసిన సంఘటన మండల పరిధిలోని రామతీర్థం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు, కుటుంబీకుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామతీర్థం గ్రామానికి చెందిన కుర్మ సాయిలు (58) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నడు. కాగా గురువారం గ్రామంలో పలు విందులలో పాల్గొని మండల కేంద్రమైన పాపన్నపేటకు ఓద్విచక్ర వాహనంపై వెళుతున్న క్రమంలో కామారెడ్డి జిల్లా నాగిరెడ్డి పేట మండల పరిధిలోని ఆత్మకూరు గ్రామానికి చెందిన ఓ ఆటో మండల కేంద్రమైన పాపన్న పేట నుండి స్వగ్రామానికి అతివేగంగా వెళుతున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం పై ఉన్న సాయిలుకు ఢి కొనడంతో కిందపడి గాయాలు కావడంతో ఆటో చాలకుడు క్షతగాత్రుణ్ణి చికిత్స నిమిత్తం పాపన్న పేట ప్రయివేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించి ఇంటి వద్ద వదిలి వెళ్ళగా రాత్రి నిద్రించిన మృతుడు శుక్రవారం ఉదయం నిద్ర లేవకపోవడంతో కుటుంబీకులు వెళ్ళి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గమనించి వెంటనే గ్రామస్తుల సహకారంతో పాపన్న పేట పోలీసులకు సమాచారం అందివ్వడంతో పాపన్న పేట పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించి మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా మృతుడికి భార్య నాగమణి ముగ్గురు కుమారులు ఉన్నారు.

# పరీక్షల దృష్ట్యా చదువుపై పూర్తి ఏకాగ్రత పెట్టాలి

### జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



**ప్రజాపక్షం/సంగారెడ్డి:** పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు చదువుపై పూర్తి దృష్టి పెట్టి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. శుక్రవారం జిల్లాలోని కంది మండలం కాశీపూర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (మైనార్టీ) ను అంగన్‌వాడి కేంద్రం ఇందిరమ్మ, ఇండ్ల నిర్మాణాలను ఆకస్మికంగ పరిశీలించారు. మొదట పాఠశాలలో తరగతి గదులు, వాష్ రూములు , ఆవరణ పరిశుభ్రతను పరిశీలించిన కలెక్టర్ మధ్యాహ్న భోజన నాణ్యత పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా అనే విషయాన్ని స్పష్టంగా తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడిన కలెక్టర్ పి.ప్రావీణ్య పరీక్షల దగ్గర పడుతున్నందున సమయాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని ,క్రమ శిక్షణతో చదవి ఉత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు. స్పెషల్ క్లాసులు జరుగుతున్నాయా సిలబస్ పూర్తి అయ్యిందా అనే అంశాలపై విద్యార్థుల నుండి వివరాలు తెలుసుకున్నారు. ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని కృషి తో ముందుకు సాగితే భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని ప్రోత్సహించారు. పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలించిన కలెక్టర్ ప్రతి రోజు శుభ్రత తప్పనిసరిగా ఉండాలని నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించి అక్కడ మౌళిక వసతులు పిల్లలకు అందిస్తున్న ఆహారం, మెనూ అమలు, పరిస్థితులను పరిశీలించారు. చిన్నారులకు పంపిణి చేసే పూలు అందరికి చేరాయా? అనే వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. తరువాత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షించిన కలెక్టర్ బిల్లుల చెల్లింపులో జాప్యం, లేకుండా చర్యలు తీసకోవాలని అధికారులకు ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో మంజురైనా ఇండ్ల సంఖ్య నిర్మాణ దశలు, లబ్ధిదారులు ఖాతాల్లో నిదుల జమ పరిస్థితులపై ఎంపిడిఓ హౌసింగ్ ఏఈలతో సమీక్ష నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న ఇండ్లకు ఫోటో కాప్చరింగ్ వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, పంచాయతీ సెక్రటరీ, ఇంజనీరింగ్ అధికారులు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/నిజాంపేట్:** నస్కల్ రైతు వేదికలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ )సౌజన్యంతో సేంద్రియ వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీ శ్రీకాంత్ రైతులకు సేంద్రియ వ్యవసాయం యొక్క ఆవశ్యకతను వివరించడం జరిగింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను సేంద్రీయ వ్యవసాయం వైపు ప్రోత్సహించే విధంగా వివిధ పథకాలనుఅమలుచేస్తుందని తెలిపారు. అదే విధంగా వివిధ పంటలకు సంబంధించి తెగులు నివారణకు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలను గురించి వివరించడం జరిగింది. అలాగే కల్వకుంట గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు రాజేశ్వర్ రెడ్డి సేంద్రియ వ్యవసాయం గురించి తన అనుభవాలను రైతులతో పంచుకోవడం జరిగింది. జీవామృతం తయారీ మరియు వానపాముల పెంపకం గురించి రైతులకు విపులంగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏవో సోమలింగారెడ్డి, ఏఈఓ శ్రీలత, ఎఫ్‌పిఓ సభ్యులు, గ్రామ రైతులు పాల్గొనడం జరిగింది.

## కెసిఆర్ చొరవతో... ప్రగతి సాధిస్తున్న గజ్వేల్ పట్టణం

**ప్రజాపక్షం/గజ్వేల్:** మాజీ సిఎం, గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్ ప్రత్యేక చొరవతో గజ్వేల్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం గజ్వేల్‌లో అకిర స్కిన్ క్లినిక్ ఆసుపత్రిని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అపరిమిత నిధులు వెచ్చించి అన్ని రంగాల్లో తీర్చిదిద్దగా, రైల్వే లైన్ ఏర్పాటు, రోడ్ల విస్తరణ, సమీకృత భవన సముదాయం, వెజ్ నాన్ వెజ్ మార్కెట్, మహతి ఆడిటోరియం, ఎడ్యుకేషన్ హబ్, వివిధ ఆసుపత్రులు తదితర వాటిని కేసీఆర్ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిపినట్లు గుర్తు చేశారు. అప్పట్లో పడిన అడుగులు నేటి అభివృద్ధికి మార్గం కాగా, త్వరలోనే గజ్వేల్ నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెంది ప్రధాన పట్టణాలకు దీటుగా రూపుదిద్దుకోనున్నట్లు తెలిపారు. సకల హంగులతో ఏర్పాటైన అకిర ఆసుపత్రిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తక్కువ ఫీజుతో వైద్యులు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ పద్మాభాయి నర్సింగరావు, కౌన్సిలర్ గోలి మమత సంతోష్ గుప్త, వైద్యులు డాక్టర్ శ్రీరంగం, డాక్టర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల ప్రతిభ అభినందనీయం

**ప్రజాపక్షం/రామాయంపేట:** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వివేకానంద విద్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రాజెక్టులను పరిశీలించిన జిల్లాసైన్స్ అధికారి రాజిరెడ్డి చిన్నారుల ప్రతిభ అభినందనీయమని విద్యార్థులను అభినందించారు. అంతకుముందు ఆయన ప్రాజెక్ట్ ప్రదర్శనను ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులు తయారు చేసిన సుమారు 2వందలకు పైగా ప్రాజెక్టులను చూసి విద్యార్థులను వాటిపై ప్రశ్నలు వేసి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనం చేసే ప్రతి పనిలో సైన్స్ ఉంటుందన్నారు. సైన్స్ లేనిదే ప్రపంచంలో ఏపని చేయలేమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఫారెస్ట్ రేంజర్ విద్యాసాగర్ మట్టి లేకుండా నీటితో పండించే వ్యవసాయ పద్ధతులపై చేసిన ప్రాజెక్టును ఆసక్తిగా తిలకించారు. ఎక్సైజ్ సిఐ నరేందర్, ఎస్ఐలు విజయ్ సిద్ధార్థ్, హరీష్, మండల విద్యాదికారి శ్రీనివాస్, పాఠశాల ప్రదానోపాధ్యాయులు ఎం.రాంకుమార్, ఉపాధ్యాయులు రాంప్రసాద్, నీరజ, జ్యోతికతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ముంపు బాధితులకు పార్టీలకతీతంగా న్యాయం చేయాలి

**ప్రజాపక్షం / గజ్వేల్:** గజ్వేల్ ఆర్ అండ్ ఆర్ కాలనీ ప్రజలకు పార్టీలకు అతీతంగా న్యాయం చేయాలని బిఆర్ఎస్ పార్టీ నేత నేతి చిన్న సంతోష్ గుప్త అన్నారు. శుక్రవారం నిర్వాసితులు కలిసి మున్సిపల్ కార్యాలయంలో సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేసిన సందర్భంగా వారు మాట్లాడారు. సర్వం కోల్పోయిన నిర్వాసితులకు గజ్వేల్ పట్టణ శివారులో ఆశ్రయం కల్పించగా, ఆరేండ్ల ఇంటి పన్ను చెల్లించాలని మున్సిపల్ అధికారులు వత్తిడీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. నిర్వాసిత ప్రాంతాల్లో సమస్యల పరిష్కారం, వారికి రావాల్సిన పెండింగ్ ప్యాకేజీలు అందిన తర్వాతనే సున్నిత అంశాలపై ఆలోచించాలని సూచించారు. ముఖ్యంగా అక్కడ నెలకొన్న సమస్యలు మున్సిపల్ పాలకమండలి పరిష్కరించాలని, కనీసం మున్సిపల్‌లో ముంపు గ్రామాల పరిగణలోకి తీసుకోవాలని కోరారు.